
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5



కృష్ణా జిల్లా వార్తలు
సోమవారం 28 ఏప్రిల్ 2025

పెదపట్నంలో భూముల రగడ!

ప్రభుత్వ భూముల్లో చెరువుల తవ్వకం

పెదపట్నంలోని ప్రభుత్వ భూముల్లో చెరువుల తవ్వకం వివాదాస్పదంగా మారింది. గ్రామస్థులు, మాజీ సైనికులు తమకు భూములు విక్రయించారంటూ అగ్రిమెంట్ పత్రాలు తెచ్చి కొందరు చెరువుల తవ్వకం చేపట్టారు. సర్వేయర్‌తో హద్దులు నిర్ణయించే పని ఆదివారం నిర్వహించారు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు అక్కడకు చేరుకుని సర్వేను అడ్డుకున్నారు. ఈ ప్రభుత్వ భూమిలో మాకు హక్కు కల్పిస్తూ పట్టాలు ఇచ్చారని, మా భూమి చూపించి హద్దులు నిర్ణయించాలని డిమాండ్ చేశారు. మా భూములు చూపకుండా చెరువు తవ్వేస్తే ఎలా అంటూ నిలదీశారు. దీంతో సర్వే ప్రక్రియ నిలిచిపోయింది.

హద్దులు నిర్ణయించేందుకు వచ్చిన సర్వేయర్

- తమకు పట్టాలిచ్చిన భూమి ఉందని అడ్డుకున్న గ్రామస్థులు
- సర్వే చేసి విడగొట్టాలని డిమాండ్
- కుదరదన్న సర్వేయర్.. నిలిచిపోయిన సర్వే
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్న గ్రామస్థులు



మచిలీపట్నం నార్త్ మండలం పెదపట్నంలో చెరువుల తవ్వకం

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : మచిలీపట్నం ఉత్తరం మండలంలోని పెదపట్నం గ్రామం సముద్ర పక్కనే ఉంటుంది. గతంలో ఇక్కడి ప్రభుత్వ భూముల్లో కొంత భాగాన్ని గ్రామానికి చెందిన 102 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి 45 సెంట్ల చొప్పున పట్టాలు ఇచ్చారు. కానీ భూమిని సర్వే చేయలేదు. సరిహద్దులు నిర్ణయించలేదు. పట్టాలు చేతికి వచ్చిన లబ్ధిదారులు ఈ భూములు తమవేనని భావిస్తూ వచ్చారు. అయితే ఈ భూములను కొందరు లబ్ధిదారులు తమకు విక్రయించేశారని ఇటీవల కాలంలో పలువురు పత్రాలు పుట్టించారు. ఈ భూముల పక్కనే మాజీ సైనికులకు ఇచ్చిన భూమిలో 30 ఎకరాలను కూడా తమకు విక్రయించేశారని పత్రాలు తెచ్చారు. మాజీ సైనికులు, గతంలో పట్టాలు తీసుకున్న వారు తమకు భూములు విక్రయించేశారని పైకి చెబుతూ కొందరు వ్యక్తులు పదిరోజులుగా ఈ భూములను చెరువులుగా మార్చే ప్రయత్నం చేస్తున్నారు. పేదలకు ఇచ్చిన భూమిలో చెరువులు తవ్వేందుకు సర్వే చేసేందుకు ఆదివారం ప్రయత్నించారు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు భూమి వద్దకు వెళ్లి సర్వే పనులను అడ్డుకున్నారు. గతంలో తమ పేరుతో ఈ భూములకు పట్టాలు ఇచ్చారని, వాటికి సరిహద్దులు నిర్ణయించి, ఆ తర్వాత మీరు కొనుగోలు చేసినట్లుగా చెబుతున్న భూముల్లో చెరువులు తవ్వుకోవాలని సూచించారు. సర్వే చేయకుండా చెరువులుగా తవ్వేస్తే, ఆ తరువాత తేడా వస్తే ఎవరు బాధ్యత

మిగతా 6లో..

సీఆర్‌జెడ్ పరిధిలో భూములు

కోస్తా నియంత్రణ మండలి(సీఆర్‌జెడ్) పరిధిలో సముద్రం అంచున 100 మీటర్ల దూరంలోనే పెదపట్నం గ్రామ పరిధిలో ఈ భూములు ఉన్నాయి. సీఆర్‌జడ్ పరిధిలో ఉన్న భూములలో ఎలాంటి చెరువుల తవ్వకాలు చేపట్టకూడదనే ఆంక్షలు కూడా ఉన్నాయి. గతంలో పేదలకు, మాజీ సైనికులకు ఇచ్చిన భూములు తమవేనని కొందరు చెరువుల తవ్వకాల పనులను చేపట్టడం, సర్వే చేయించే పనులు చేయడంతో ఈ భూముల అంశం వివాదాస్పదమవుతోంది, ప్రభుత్వ భూములను తమవిగా చూపి, వాటిని భీమవరానికి చెందిన ఒకరిద్దరు బడాబాబులకు లీజుకు ఇచ్చి సొమ్ము చేసుకునేందుకు కొందరు ప్రయత్నాలు చేస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఈ భూములను స్థానికులకైనా ఇవ్వాలి లేదా యథాస్థితిలో ఉంచాలని, అలా కాకుండా బయటి వ్యక్తులు సాగు చేసుకునేలా చెరువులుగా తవ్వడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ భూములను ఇతరులు ఆక్రమిస్తూ ఉంటే చూస్తూ ఉండబోమని స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములను ఆక్రమించి చెరువులుగా మారుస్తున్న విషయాన్ని స్థానిక నాయకులు పాలకులకు తెలియకుండా కొందరు పక్కదారి పట్టిస్తున్నారని పెదపట్నం గ్రామస్థులు విమర్శిస్తున్నారు. ఈ అంశంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని గ్రామస్థులు అంటున్నారు.

పెట్టుబడికి రెట్టింపు అంటూ రూ.కోట్లతో పరార్!

నగరంలో యూపిక్స్ మాయ!

- రెట్టింపు లాభాల పేరుతో ప్రజలకు ఎర
- వచ్చిన పెట్టుబడులతో ఆస్తుల కొనుగోలు
- జనవరి నుంచి చెల్లింపులు నిలిపివేత
- కార్యాలయానికి తాళం.. అజ్ఞాతంలోకి వ్యవస్థాపకుడు కిరణ్
- పోలీసులను ఆశ్రయించిన బాధితులు



ప్రజల నుంచి పెట్టుబడులను ఆకర్షించడానికి సాంకేతిక రంగాన్ని ఎంచుకున్నాడు. ఒక వీడియోను ఎన్ని మార్పులతో అయినా అద్భుతంగా మలచగలిగే యానిమేషన్ పేరు సంస్థకు పెట్టుకున్నాడు. ఆ పేరును ఉపయోగించుకుని రెట్టింపు లాభాలు ఇస్తానని అందర్నీ నమ్మించాడు. వారు పెట్టిన పెట్టుబడితో సొంత ఆస్తులు సమకూర్చుకున్నాడు. తిరిగి చెల్లింపులు చేయాల్సి రావడంతో ఇప్పుడు ముఖం చాటేసి అజ్ఞాతంలోకి పారిపోయాడు. ఇదీ విజయవాడకు చెందిన నిడుమోలు వెంకట సత్యలక్ష్మీకిరణ్ వ్యవహారం.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) విజయవాడకు చెందిన నిడుమోలు వెంకట సత్యలక్ష్మీకిరణ్ సత్యనారాయణపురంలో కొద్దినెలల క్రితం యూపిక్స్ యానిమేషన్స్ పేరుతో సంస్థను ఏర్పాటు చేశాడు. ఇక్కడి నుంచి కార్యకలాపాలను రాష్ట్రమంతటా విస్తరించాడు. తన సంస్థలో రూ.లక్ష పెట్టుబడి పెట్టిన వారికి ఆరు నెలల్లో రూ.2లక్షలు తిరిగి చెల్లిస్తానని ప్రకటనలు గుప్పించాడు. ఇలా మార్కెటింగ్ చేసుకుని పెట్టుబడులు రావడం మొదలయ్యాక అసలు స్కెచ్‌ను అమలు చేశాడు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందవచ్చని సైబర్ నేరగాళ్లు చేసిన ప్రకటనలను ఆదర్శంగా తీసుకుని పెట్టుబడికి రెట్టింపు లాభాలు నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాడు. దీని మాయలోపడి రూ.లక్షల్లో కొందరు, కోట్లలో మరికొందరు పెట్టుబడులు పెట్టారు. తర్వాత నెమ్మదిగా జనవరి నుంచి చెల్లింపులు ఆపేశాడు. సరిగ్గా ఏప్రిల్ నెల వచ్చే సరికి సత్యనారాయణపురంలో ఉన్న కార్యాలయానికి తాళాలు వేశాడు. నిడుమోలు కిరణ్ తమను నిండా ముంచేశాడని ఆలస్యంగా తెలుసుకున్న బాధితులు సత్యనారాయణపురం పోలీసులను ఆశ్రయించారు.

మళ్లీ వంచనకు సెల్ఫీ వీడియోతో స్కెచ్!

నిడుమోలు వెంకట సత్యలక్ష్మీకిరణ్‌పై పోలీసులు కేసు నమోదు చేయడంతో బాధితులను మరోసారి వంచించడానికి ప్రయత్నాలు మొదలుపెట్టాడు. ఇతర రాష్ట్రాలకు పారిపోయి సెల్ఫీ వీడియోను విడుదల చేశాడు. కిరణ్ సుమారుగా రూ.10కోట్ల మేరకు ప్రజల

మిగతా 6లో..

నైపుణ్య మస్తు!

ఎన్టీఆర్ జిల్లాలో విస్తృతంగా స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు

- విద్యార్థులను సానబెట్టేందుకు ప్రత్యేక కేంద్రాల ఏర్పాటు
- ఎంపిక చేసిన కాలేజీల్లో సాంకేతిక, డిజిటల్ మార్కెటింగ్ అంశాలపై శిక్షణ
- బీపీఎం, వెబ్ సర్వీసెస్ కోర్సులకు విశేష స్పందన
- స్కిల్ హబ్స్‌తో కూడా విద్యార్థులకు నైపుణ్య శిక్షణ
- నిరుద్యోగుల కోసం జాబ్ ఫెయిర్స్‌తో అసంఘటిత రంగంలో ఉపాధి అవకాశాలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): విద్యార్థులకు మెరుగైన ఉపాధి, ఉద్యోగావకాశాల కల్పన కోసం ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం అడుగులు వేస్తోంది. స్వయం ఉపాధి పథకాలు, సాంకేతిక కోర్సులు, మార్కెటింగ్ రంగాల్లో ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకునేందుకు అవసరమైన నైపుణ్య శిక్షణను కళాశాలల్లో ఏర్పాటు చేసిన నైపుణ్య శిక్షణ కేంద్రాల ద్వారా ఇప్పిస్తోంది. వందలాది మంది విద్యార్థులు ఈ శిక్షణకు హాజరవుతున్నారు. ఇప్పటి వరకు 7,357 మంది విద్యార్థులు నైపుణ్య శిక్షణ కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 4,164 మందికి శిక్షణ పూర్తయింది. మరో 1,208 మంది శిక్షణ తీసుకుంటున్నారు. శిక్షణ పొందిన వారిలో 1,154 మందికి సర్టిఫికెట్లను కూడా అందజేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఉద్యోగాలు సాధించాలంటే మంచి మార్కులతోపాటు

మిగతా 6లో..



స్కిల్ హబ్స్‌తోనూ నైపుణ్య శిక్షణ

పైన చెప్పుకున్నవి కాకుండా 'స్కిల్ హబ్స్' పేరుతో మరో పదహారు అంశాలలో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. అకౌంట్స్ ఎగ్జిక్యూటివ్, అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, అసిస్టెంట్ సర్వేయర్, అసోసియేట్ డేటా ఎంట్రీ ఆపరేటర్, డెబిట్ రికవరీ ఏజెంట్, డొమెస్టిక్ బయోమెట్రిక్ డేటా ఆపరేటర్, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, లైట్ వెహికల్ సర్వీస్ టెక్నీషియన్, జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్, రిటైల్ సేల్స్ అసోసియేట్, సోషల్ మీడియా ఎగ్జిక్యూటివ్, వెబ్ డెవలపర్ వంటి కోర్సులలో శిక్షణ ఇవ్వడం జరుగుతోంది. వీటికి సంబంధించి ఇప్పటివరకు 264 మంది విద్యార్థులు శిక్షణ పొందారు. మరో 274 మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు. వీరిలో 169 మందికి ఉద్యోగాలు కూడా వచ్చాయి.

ఏపీటీఏలో అరాచకం!

పలువురు కాంట్రాక్టు, డిప్యూటేషన్ ఉద్యోగుల హవా!



- రెగ్యులర్ ఉద్యోగులను కాదని.. అనర్హులకు అందలం
- అర్హతలు లేకపోయినా.. కీలక విభాగాలు అప్పగింత
- అవినీతికి పాల్పడుతున్న కొందరు కాంట్రాక్టు ఉద్యోగులు
- వీరికి డిప్యూటేషన్ మీద వచ్చిన అధికారుల వత్తాసు
- సీఎంవోకు ఫిర్యాదులు వెళ్లినా.. చర్యలు శూన్యం

ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీలో కాంట్రాక్టు ఉద్యోగులు, డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న ఉద్యోగుల తీరు విమర్శలకు దారితీస్తోంది. రెగ్యులర్ ఉద్యోగులను కాదని అనర్హులకు కీలక విభాగాల బాధ్యతలు అప్పగిస్తూ అంతులేని అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఈవెంట్లు, రిక్రూట్‌మెంట్, అటెండెన్స్, బదిలీలు తదితర వ్యవహారాల్లో పలువురు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. సీఎంవోకు ఫిర్యాదులు వెళ్లినా వీరిపై చర్యలు తీసుకోవడంలేదని సమాచారం.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ (ఏపీటీఏ)లో కొందరు కాంట్రాక్టు ఉద్యోగుల కారణంగా అరాచకం రాజ్యమేలుతోంది. అవినీతికి కేంద్ర స్థావరంగా మారుతోంది. అవినీతి రుచి మరిగిన కాంట్రాక్టు ఉద్యోగుల చేత డిప్యూటేషన్‌పై వచ్చిన కొందరు అధికారులు అన్ని తప్పులు చేయిస్తున్నారు. ఇక్కడ మేనేజర్ల స్థాయిలో పనిచేసే కొందరు కాంట్రాక్టు ఉద్యోగులకు కనీస అర్హతలు లేకపోయినా కూడా, వారిని ఆ పోస్టుల్లో కూర్చోపెడుతున్నారు. ఎంతో కీలకమైన మేనేజర్ల స్థానాలలో సంస్థ రెగ్యులర్ ఉద్యోగులను నియమించకుండా వారిని ఉన్నతాధికారులు పూర్తిగా పక్కన పెట్టేశారు. తగిన అనుభవం ఉన్నా కూడా వారి సేవలను ఉపయోగించుకోవటం లేదు. ఎందుకంటే డిప్యూటేషన్ విధానంలో ఇతర శాఖల నుంచి వచ్చిన అధికారులు కొందరు అవినీతి రుచి మరిగారు. తమ అవినీతి ఆకలిని తీర్చేందుకు అవినీతికి అలవాటు పడిన కాంట్రాక్టు సిబ్బంది కొందరిని వీరు పెంచి పోషిస్తున్నారు. పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ)లో

మిగతా 6లో..

వైసీపీ హయాంలో రెచ్చిపోయారు!

కొందరు కాంట్రాక్టు ఉద్యోగులు గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పేట్రేగిపోయారు. ఏపీటీఏను అవినీతి కేంద్రంగా మార్చివేశారు. వీటికి సంబంధించి కొందరు కాంట్రాక్టు సిబ్బందిపై ప్రస్తుత ప్రభుత్వానికి ఫిర్యాదులు కూడా వెళ్లాయి. సీఎంవో కార్యాలయం స్థాయిలో బాధ్యులైన వారిని తొలగించమని ఆదేశాలు జారీ చేసినా.. ఏపీటీఏలో అమలు కావటం లేదు. దీనికి ప్రధాన కారణం డిప్యూటేషన్ మీద వచ్చిన అధికారులే కావటం గమనార్హం. సంస్థలో అనేక విభాగాలలో అధికారుల స్థానంలో ఇతర శాఖల నుంచి డిప్యూటేషన్ల మీద వచ్చారు. వీరిలో కొందరు ఇక్కడ బాగుంటుందన్న ఉద్దేశ్యంతోనే వచ్చారు. ఇలాంటి వారు డబ్బులు సంపాదించటానికి కాంట్రాక్టు ఉద్యోగులను పావులుగా వాడుకుంటున్నారు. ప్రిన్సిపల్ సెక్రటరీలు, ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి చర్యలు తీసుకోమని ఆదేశాలు వచ్చినా కూడా వారిని కాపాడే ప్రయత్నాలు జరుగుతున్నాయి.

సమస్యలతో సహజీవనం

బీసీ బాలికల గురుకుల విద్యాలయంలో కనీస వసతులు కరువు

- ఐదు తరగతి గదులు.. అక్కడే చదువు.. అక్కడే నిద్ర
- 240 మంది విద్యార్థినులకు మూడు మరుగుదొడ్లు!
- పునాది దశలోనే కొత్త భవన నిర్మాణం
- ఇబ్బందుల్లో బాలికలు.. పట్టించుకోని అధికారులు



బీసీ గురుకుల విద్యాలయంలో విద్యార్థినులు

పునాదుల్లోనే నిలిచిపోయిన భవనాలు



చాలీచాలని మరుగు దొడ్లు



(మచిలీపట్నం టౌన్ - ఆంధ్రజ్యోతి): మచిలీపట్నం వలందపాలెంలో బీసీ బాలికల గురుకుల విద్యాలయం విద్యార్థినులు సమస్యలతో సహజీవనం చేస్తున్నారు. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లోని పలు ప్రాంతాలకు చెందిన విద్యార్థినులు 240 మంది ఐదవ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఇక్కడ చదువుతున్నారు. మొత్తం ఐదు తరగతి గదులు ఉన్నాయి. వాటిలోనే పగలు విద్యనభ్యసిస్తున్నారు. అవే గదుల్లో రాత్రిపూట బస చేస్తున్నారు. పాతికేళ్ల క్రితం ప్రారంభించిన ఈ గురుకుల విద్యాలయం భవనాలు శిథిలావస్థకు చేరాయి. చాలీచాలని గదులతో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో నూతన వసతి గృహాల నిర్మాణం కోసం రూ.1.40 కోట్లు కేటాయించారు. అయితే నిధుల మంజూరులో అలసత్వం వహించడంతో ఆ భవనాలు పునాదుల్లోనే నిలిచిపోయాయి. విద్యార్థినులకు సరిపడా మరుగుదొడ్లు కూడా లేక అవస్థలు పడుతున్నారు. డైనింగ్ హాల్, రీడింగ్ రూమ్, లైబ్రరీ, లేబరేటరీ వంటి మౌలిక సదుపాయాలు సరిగా లేవు. హాస్టల్‌కు సరైన డ్రైనేజీ వ్యవస్థ కూడా లేకపోవడం వల్ల రాత్రిపూట విద్యార్థినులు దోమల బారిన పడుతున్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ప్రయోజనం శూన్యం. ఇటీవల జిల్లా కలెక్టర్ మహాత్మా జ్యోతీరావుపూలే జయంతి సందర్భంగా ఈ బాలికల గురుకుల పాఠశాలను సందర్శించారు. ఆ సమయంలో విద్యార్థినులు తమ సమస్యలను కలెక్టర్ బాలాజీకి వివరించారు.

బాగా ఇబ్బంది పడుతున్నాం



ప్రస్తుతం ఉన్న వసతి గృహంలో సౌకర్యాలు లేక, సరిపోక బాగా ఇబ్బంది పడుతున్నాం. మా హాస్టల్‌కు దగ్గరలో ఖాళీగా ఉన్న గిరిజన సంక్షేమ శాఖ హాస్టల్‌కు మరమ్మతులు చేయించి తాత్కాలికంగా ఇవ్వాలి. పునాదుల్లోనే నిలిచిపోయిన భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలి. బాలికల గురుకుల విద్యాలయ సమస్యలను సొసైటీ సెక్రటరీ మాధవీలతకు, జిల్లా కలెక్టర్ బాలాజీకి వివరించాం. నిండు మనసుతో విద్యార్థినుల సమస్యలను పరిష్కరిస్తారని ఆశిస్తున్నాం.

- పి. ఉషారాణి, ప్రిన్సిపాల్, గురుకుల విద్యాలయం



బీసీ హాస్టల్ ఎదురు ఖాళీగా ఉన్న ఎస్టీ హాస్టల్ భవనం



మంత్రి సత్యకుమార్ 'ఆంధ్రజ్యోతి'లో రాస్తున్న వ్యాసాల సంపుటి రెండో భాగం పుస్తకాన్ని విజయవాడలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో ఆదివారం ఆవిష్కరిస్తున్న కేంద్ర బొగ్గు, గనుల శాఖామంత్రి జి.కిషన్‌రెడ్డి, మంత్రులు నాదెండ్ల మనోహర్, వై.సత్యకుమార్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్

6లో



విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య (ఎంబీ భవన్) విజ్ఞాన కేంద్రంలో గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ నాయకుడు వల్లూరి శివప్రసాద్ అధ్యక్షతన ఆదివారం జరిగిన ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ సదస్సులో మాట్లాడుతున్న అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, చిత్రంలో విద్యావేత్తలు, విద్యావంతులు

6లో



మాట్లాడుతున్న యూనియన్ అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు

ఖాళీ పోస్టులు భర్తీ చేయండి

» పదోన్నతులకు వెంటనే అనుమతులు ఇవ్వాలి

» ఆర్టీసీ ఈయూ డిమాండ్

బస్‌స్టేషన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : ఏపీఎస్‌ఆర్టీసీలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయటంతో పాటు పదోన్నతులకు వెంటనే అనుమతి ఇవ్వాలని ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్ చేసింది. విజయవాడలోని యూనియన్ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం జరిగిన జోన్ ఎగ్జిక్యూటివ్ సమావేశం జోనల్ అధ్యక్షుడు ఎం.ఎస్.రావు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు మాట్లాడుతూ, గత 12 సంవత్సరాలుగా కారుణ్య నియామకాలు తప్ప నోటిఫికేషన్‌తో ఒక్క పోస్టు భర్తీ చేయలేదని చెప్పారు. సుమారు 11వేల పోస్టులు వివిధ కేటగిరిల్లో ఖాళీగా ఉన్నాయని, వీటన్నింటినీ భర్తీ చేసేందుకు ప్రభుత్వం అనుమతి ఇవ్వాలని కోరారు. దీనిద్వారా బడుగు, బలహీన వర్గాలకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. అన్ని కేటగిరిల లోని పోస్టులను భర్తీ చేయాలని, పీఆర్సీ కమిషన్‌ను వెంటనే నియమించాలని, రావాల్సిన బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని కోరారు. రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎండీ ప్రసాద్ మాట్లాడుతూ, ఎంప్లాయిస్ హెల్త్ ఇన్సూరెన్స్ స్కీమ్ ద్వారా కనీస వైద్య సౌకర్యాలు కూడా అందటం లేదన్నారు. పాత పద్ధతిలో వైద్య సౌకర్యాలు కల్పించాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి సి.నబీ రసూల్ మాట్లాడుతూ, 2019లో జారీ చేసిన సర్క్యులర్-1ను వైసీపీ ప్రభుత్వం పక్కన పెట్టిందని, దీనిని అమలు చేయాలని కోరారు. కోశాధికారి ఎండీప సిద్ధిఖ్, ఉపాధ్యక్షుడు మందపాటి శంకర్‌రావులు మాట్లాడుతూ, కొత్త కంప్యూటర్, ప్రింటర్ పనిచేసే ప్రదేశాలలో సిబ్బందికి అవసరమైన పర్నిచర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు బాలాజీ, టివి భవానీ, కోటేశ్వరరావు, చక్రవర్తి, నారాయణ, ఆలీ తదితరులతో పాటు జోన్ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.


ఎస్‌ఐకి ఫిర్యాదు చేస్తున్న నేతలు

కేశినేని నానిపై చర్యలు తీసుకోండి

» ఎ.కొండూరు స్టేషన్‌లో టీడీపీ నేతల ఫిర్యాదు

ఎ.కొండూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధి, నిరుద్యోగులకు ఉపాధికల్పన కోసం సీఎం చంద్రబాబు తీసుకొంటున్న చర్యలను చూసి ఓర్వలేక మాజీ ఎంపీ కేశినేని శ్రీనివాస్(నాని) సోషల్ మీడియా వేదికగా అసత్య ఆరోపణలు చేస్తున్నరని తిరువూరు మాజీ ఏఎంసీ చైర్మన్ అలవాల రమేష్‌రెడ్డి అన్నారు. పరిశ్రమల స్థాపన కోసం పెట్టుబడిదారులు ముందుకు వస్తుంటే మతిభ్రమించిన శ్రీనివాస్(నాని) కూటమి ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ప్రజలకు సేవా కార్యక్రమాలు చేస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని)పై వ్యక్తిగత కక్ష సాధింపులకు పాల్పడుతున్నరని విమర్శించారు. విజయవాడ పార్లమెంట్ కార్యాలయానికి ఆంధ్రుల ఆరాధ్య దైవం ఎన్టీఆర్ పేరు పెడితే, ఎక్స్ వేదికగా విమర్శలు చేయడం నాని అవివేకానికి నిదర్శనమని, ఈ చర్య ఎన్టీఆర్‌ను అవమాన పరచడమేనన్నారు. రాష్ట్ర అభివృద్ధికి అడ్డుపడుతున్న కేశినేని శ్రీనివాస్(నాని)పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నేతలు రాంప్రసాదరెడ్డి, భీమానాయక్, పీక్లానాయక్ తదితరులు పాల్గొన్నారు.

మచిలీపట్నం సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ మన్మథరావు

మచిలీపట్నం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ వి.మన్మథరావును నియమిస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. విశాఖపట్నం ఏఎంసీలో జనరల్ సర్జరీ విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఆయనను మచిలీపట్నం సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.


అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన ఆర్డీవో

క్షిపణి కేంద్ర శంకుస్థాపన ఏర్పాట్ల పరిశీలన

అవనిగడ్డ, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : నాగాయలంక మండలం గుల్లలమోదలో డీఆర్డీవో క్షిపణి పరిశోధనా కేంద్రం పనులను ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభించనున్న నేపథ్యంలో ఆదివారం ఆర్డీవో కె.స్వాతి ఏర్పాట్లు పరిశీలించారు. మే 2న అమరావతి పర్యటనకు రానున్న ప్రధాని క్షిపణి పరిశోధనా కేంద్రం నిర్మాణపనులను వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. సుమారు రూ.20 వేల కోట్లకు పైగా వెచ్చించనున్నారు. క్షిపణి పరిశోధనా కేంద్రంతో పాటు అవనిగడ్డ నియోజకవర్గంలో ఒక టౌన్‌షిప్ కూడా నిర్మించనుండగా, ఈ కేంద్రంతో దివి ప్రాంత స్వరూపమే మారనుందని ఈ ప్రాంత ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఏర్పాట్లపై ఆర్డీవో వివిధ శాఖల అధికారులు, ఎంఐసీ అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఆఫీసర్ సమీర్ శర్మతో కలిసి సమీక్ష నిర్వహించారు.

గుడివాడ రైల్వేస్టేషన్‌లో తనిఖీలు

గుడివాడ, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : గుడివాడ రైల్వేస్టేషన్‌లో లా అండ్ ఆర్డర్, రైల్వే పోలీసులు సంయుక్తంగా ఆదివారం తనిఖీలు చేపట్టారు. మచిలీపట్నం నుంచి వచ్చిన బాంబ్ స్క్వాడ్‌తో కలిసి ప్రత్యేకంగా తనిఖీలు చేశారు. రైళ్లలో దొంగతనాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డ్రోన్ కెమెరాలతో గుడివాడ రైల్వేస్టేషన్ పరిసరాలను పర్యవేక్షించారు. అనంతరం రైల్వే ఎస్.ఐ మహబూబ్ షరీఫ్ మాట్లాడుతూ రైళ్లలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా జిల్లా లా అండ్ ఆర్డర్ పోలీసులతో కలిసి సంయుక్తంగా తనిఖీలు నిర్వహించామన్నారు. తనిఖీల్లో టూటౌన్ సీఐ చల్లా నాగప్రసాద్, కమర్షియల్ ఇన్స్‌పెక్టర్ భగవాన్ నాయక్, రైల్వే ఎస్.ఐ మహబూబ్ షరీఫ్, రైల్వే స్టేషన్ మాస్టర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ప్రయాణికులతో మాట్లాడుతున్న రైల్వే పోలీసులు

ఓబీసీ కులగణన జరపాలి

» బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకర్రావు

వన్‌టౌన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : ఓబీసీలకు కులగణన జరిపి ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకర్రావు కోరారు. బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద బీఆర్ అంబేడ్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహాలకు ఆయన వినతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతంలో ప్రజాప్రతినిధులు, అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా స్పందన లేదని విమర్శించారు. న్యాయం కోసం అంబేడ్కర్, పూలే విగ్రహాలకు వినతి పత్రాలు అందజేశానన్నారు. జనాభా లెక్కలతో పాటు బీసీలకు సమగ్ర కులగణన జరగాలన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఒకలా, లేనప్పుడు ఇంకోలా పార్టీలు ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తున్నాయన్నారు. కులగణన డిమాండ్‌తో ఇకపై ప్రత్యక్ష పోరాటాలు చేస్తామన్నారు. దేశ జనాభాలో 52 శాతంగా ఉన్న ఓబీసీల సంక్షేమ అభివృద్ధి కోసం కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. శాంతియుతంగా ర్యాలీ నిర్వహిస్తుంటే పోలీసులు వేధించి అరెస్టు చేయటం అన్యాయమన్నారు. ఆదివారం బందరురోడ్డులో ర్యాలీ ప్రదర్శన చేస్తుండగా పోలీసులు శంకరరావును అరెస్టు చేసి.. తరువాత విడుదల చేశారు. కుమ్మరి క్రాంతికుమార్, అన్నవరపు నాగమల్లేశ్వరరావు, ఎన్ఎస్ఎన్ మూర్తి, గుంటుపల్లి ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏపీ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు

సత్యకాలం వ్యాసాలు నేటి పాలకులకు గైడ్

» కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

మొగల్రాజపురం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : 'సత్యకాలం' పేరుతో 'ఆంధ్రజ్యోతి'లో ప్రతి మంగళవారం సత్యకుమార్ రాసిన వ్యాసాల సంకలనాలు నేటి రాజకీయ నాయకులకు, విద్యార్థులకు, రాజకీయాల్లో వచ్చే వారికి గైడ్ వంటివని కేంద్ర బొగ్గు గనుల శాఖామంత్రి కిషన్‌రెడ్డి చెప్పారు. మంత్రి సత్యకుమార్ 'ఆంధ్రజ్యోతి'లో రాస్తున్న వ్యాసాల సంపుటి రెండోభాగం పుస్తకావిష్కరణ విజయవాడలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ, రాజకీయ నాయకులు, సామాజికవేత్తలు, విశ్లేషకులు వివిధ పత్రికల్లో వ్యాసాలు రాయడం ఒక అవసరమని వ్యాఖ్యానించారు. ఆ కోవలోనే సత్య వ్యాసాలు రాసినా వాటి ప్రత్యేకత వేరని చెప్పారు. ఒక కార్యకర్తగా ప్రయాణం ప్రారంభించిన సత్యకుమార్ 2019 నుంచి మంత్రి అయ్యేవరకు ప్రతి మంగళవారం క్రమం తప్పకుండా వ్యాసాలు రాయడం స్ఫూర్తిదాయకమన్నారు. అది అందరికీ సాధ్యం కాదన్నారు. సత్యను ప్రోత్సహించి వ్యాసాలు ప్రచురించిన 'ఆంధ్రజ్యోతి' ఎండీ రాధాకృష్ణకు ధన్యవాదాలు తెలిపారు. వెంకయ్యనాయుడు వద్ద సహాయకుడిగా పనిచేసి దశలవారీగా సత్యకుమార్ ఎదిగారన్నారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ, రాజకీయ నాయకులకు సమాజంపై అవగాహన ఉంటుంది కానీ, దానికి అక్షరరూపం ఇవ్వడం అందరికీ సాధ్యం కాదని, దాన్ని సత్యకుమార్ చేసి చూపించాడని చెప్పారు. సత్యకుమార్ వ్యాసాలు చదువుతుంటే.. ప్రస్తుత సమాజ తీరు, ప్రజలు పడుతున్న కష్టాలు, ఆ కష్టాలను పోగొట్టడానికి ప్రభుత్వం చేస్తున్న కృషిని అడ్డుకుంటున్న శక్తుల గురించి లోతుగా అధ్యయనం చేసినట్టు స్పష్టమవుతుందన్నారు. మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ, ఈ రోజుల్లో యువతకు సమాజం, ప్రజల సమస్యల పట్ల అవగాహన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. యువత పత్రికలు చదవడం అలవాటు చేసుకోవాలని, రాష్ట్రం గురించి తెలుసుకోవాలని చెప్పారు. సత్యకుమార్ వ్యాసాలు చదివితే యువతకు జాతీయ అంతర్జాతీయ అంశాలపై అవగాహన వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గజల్ శ్రీనివాస్, టీడీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురాం, జనసేన ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను, ప్రముఖ వైద్యుడు ఇండ్ల రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ను అవమానపరిచింది కాంగ్రెస్సే

» మంత్రి సత్యకుమార్ యాదవ్



మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్

విద్యాధరపురం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానపరిచింది, ఆయన ఆశయాలను తుంగలో తొక్కింది కాంగ్రెస్ పార్టీయేనని మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. భవానీపురం ఆర్టీసీ వర్క్‌షాపు రోడ్డులోని ఎస్ కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం అంబేడ్కర్ 137వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి, రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ, రాజ్యాంగాన్ని జాతికి అందించిన అంబేడ్కర్ గురించి కాంగ్రెస్ పార్టీ నాయకులు అసత్య ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. అంబేడ్కర్ ఆశయాలను ప్రజలకు అందిస్తున్నది ప్రధాని మోదీ అని, ఆయన రాజ్యాంగ స్ఫూర్తికి కట్టుబడి పనిచేస్తున్నారని కొనియాడారు. రిజర్వేషన్‌ల వలన అసమర్థులుగా మారతారని కాంగ్రెస్ నేతలు అనేకసార్లు చెప్పారని మంత్రి సత్యకుమార్ విమర్శించారు. కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యవర్గసభ్యురాలు బొడ్డు నాగలక్ష్మి, ఐఏఎస్ అకాడమీ ట్రైనర్ విజయకుమార్ పాల్గొన్నారు.

గ్రంథాలయాల పట్ల ఆసక్తి పెంచాలి

» ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్

గవర్నర్‌పేట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : పిల్లలు చిన్నతనం నుంచే గ్రంథాలయాలకు వెళ్లేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక ఆధ్వర్యంలో ఎంజీ రోడ్డులోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో గ్రంథాలయాల ఆవశ్యకతపై రాష్ట్ర సదస్సు నిర్వహించారు. రాష్ట్రం నలుమూలల నుంచి రచయితలు, పుస్తక ప్రచురణకర్తలు, ఉపాధ్యాయులు, విద్యావేత్తలు, ప్రజా సంఘాల నేతలు హాజరయ్యారు. వేదిక ఆధ్వర్యంలో వెలువరించిన వ్యాస సంకలనం గ్రంథాలయ విజ్ఞానం పుస్తకాన్ని ప్రముఖ విద్యావేత్త డాక్టర్ పరిమి, బుద్ధప్రసాద్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బుద్ధప్రసాద్ మాట్లాడుతూ, విద్యార్థులకు చదువు, భాష, విజ్ఞానం పట్ల ఆసక్తి పెంచాలని, వారు గ్రంథాలయాలకు వెళ్లేలా ప్రోత్సహించాలని కోరారు. పట్టణాలలో కంటే గ్రామీణ ప్రాంతాల్లోనే ఎక్కువ శాతం గ్రంథాలయాలు మూతపడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. టెక్నాలజీ ఎంత పెరిగినా పుస్తకాల ప్రాముఖ్యత తగ్గలేదని, వేదిక ఆధ్వర్యంలో ప్రజలు గ్రంథాలయాల వైపు వెళ్లేలా, పుస్తక పఠనంపై శ్రద్ధ పెట్టేలా ప్రచారం జరగాలని కోరారు. విరప బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ, గ్రంథాలయాల కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని కోరారు. కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ, ఉన్నత విద్య, సివిల్స్ పోటీ పరీక్షలకు వెళ్లే వాళ్లలో ఎక్కువ శాతం గ్రంథాలయాల మీద ఆధారపడుతున్న విషయాన్ని ప్రస్తావించారు. వేదిక అధ్యక్షుడు నల్లూరు శివప్రసాద్ మాట్లాడుతూ, గ్రంథాలయ ఉద్యమం మొదలైన విజయవాడ వేదికగానే గ్రంథాలయ పునర్వికాస ఉద్యమాన్ని మొదలుపెట్టినట్టు చెప్పారు. ఉద్యమంలో భాగంగా సమస్యలపై ప్రభుత్వానికి వినతిపత్రాలు, పరిష్కారాలకై ఒత్తిడి తేవడం జరుగుతుందని తెలిపారు. సదస్సులో గ్రంథాలయ ప్రముఖులు రావి శారద, కేంద్ర సాహిత్య పురస్కార గ్రహీతలు పెనుగొండ లక్ష్మీనారాయణ, పాపినేని శివశంకర్, వివిధ సంఘాల నేతలు ప్రసంగించారు. సదస్సులో పలు తీర్మానాలు ఆమోదించారు.


సదస్సులో ప్రసంగిస్తున్న బుద్ధప్రసాద్

ఏపీటీఏలో అరాచకం!

(5వ పేజీ తరువాయి)

సంస్థ ఎండీ ఏ ఆదేశం ఇచ్చినా వాటిని తప్పకుండా అమలు చేస్తారు. ఇదే ఎండీ ఏపీటీఏ సీఈవోగా కూడా వ్యవహరిస్తున్నారు. కానీ, ఎక్కడా సీఈవో ఆదేశాలు అమలు జరిగినట్టు దాఖలాలు లేవు. దీనికి ఏపీటీఏలో నెలకొన్న అవినీతి వ్యవహారాలే కారణమన్న ఆరోపణలు ఉన్నాయి. సంస్థలో జరుగుతున్న వ్యవహారాలను తెలిసి కూడా డిప్యూటీ సీఈవో ఉన్నతాధికారిణి దృష్టికి తీసుకువెళ్లటం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఈవెంట్స్ పేరుతో దోపిడీ

కొందరు అవినీతి కాంట్రాక్టు ఉద్యోగులు వెలగబెడుతున్న వ్యవహారాలు చూస్తే ముక్కున వేలేసుకోవాల్సిందే. ఏపీటీఏలోకి వచ్చిన తర్వాత అవినీతి మార్గాలు తెలిసిన కొందరు కీలక స్థానాలను కైవసం చేసుకున్నారు. ఇలా కీలక స్థానాలను కైవసం చేసుకున్న వారు అందిన కాడికి అవినీతికి పాల్పడుతున్నారన్న తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. ఏపీటీఏ నిర్వహించే ఫెస్టివల్స్, ఇతర ఈవెంట్స్‌కు సంబంధించి అంచనాలు పెంచేసి తమవారికి కట్టబెట్టేస్తున్నారన్న తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. వీటికి సంబంధించి ఉన్నతాధికారులకు లిఖితపూర్వకంగా కూడా ఫిర్యాదులు అందాయి. సంస్థ నేతృత్వంలో నిర్వహించే వేడుకలు, ఫెస్టివల్స్, ఈవెంట్స్‌కు సంబంధించి పాల్గొనే అర్హత కలిగిన కంపెనీలను కూడా కొందరు కాంట్రాక్టు ఉద్యోగులే నిర్దేశించారని తెలుస్తోంది. తమకు కావాల్సిన వాటినే ఎంపిక చేసి.. మిగిలిన వాటిని తిరస్కరించినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఇలా ఎంపిక చేసిన సంస్థలలో ఒకే సంస్థకు ఎక్కువ సార్లు ఈవెంట్లు దక్కటం గమనార్హం. ఈ ఈవెంట్ల మాటున ఆయా సంస్థల నుంచి భారీ ఎత్తున కమీషన్లు దండుకుంటున్నట్టు తెలుస్తోంది. మార్కెట్‌లో రేటు కంటే అంచనాలలో చూపే రేట్లు ఎక్కువగా ఉంటున్నాయన్న తీవ్ర ఆరోపణలు వస్తున్నా ఏ రోజున కూడా ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించకపోవటం గమనార్హం. ఈవెంట్లకు సంబంధించి చూస్తే పెండింగ్ బిల్స్ ఉన్న కాంట్రాక్టర్లతో సంస్థపైనే కేసులు వేయించారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. ఈ కేసుల విషయంలో సంస్థ ఓడిపోయేలా బలహీన వాదనలు వినిపించారన్న విమర్శలు కూడా ఉన్నాయి.

గ్రూపుగా ఏర్పడి మరీ..

సంస్థలో నిబంధనలకు విరుద్ధంగా రిక్రూట్‌మెంట్ జరిపిన వ్యవహారంలో కూడా తీవ్ర స్థాయిలో ఆరోపణలు వచ్చాయి. అటెండెన్స్ వ్యవహారంలో భారీగా అక్రమాలు చోటు చేసుకున్నాయన్న విమర్శలు కూడా ఉన్నాయి. మాట వినని ఉద్యోగులను ఇతర జిల్లాలకు ఇష్టానుసారం బదిలీలు నిర్వహించటం సంస్థలో పరిపాటిగా మారిందన్న ఆరోపణలు ఉన్నాయి. సంస్థలో పనిచేసే మిగిలిన ఉద్యోగులను ఒక రకంగా తమ అవినీతి నెట్‌వర్క్‌లో ఉన్న ఉద్యోగులను ఒక రకంగా చూసే పరిస్థితులు నెలకొన్నాయి. అవినీతికి అలవాటు పడిన ఉద్యోగులంతా కూడా ఒక చెయిన్ నెట్‌వర్క్‌లా సంస్థలో పాతుకుపోయారు. ఎలాంటి అర్హతలు లేకపోయినా, అనుభవం లేకపోయినా, రెగ్యులర్ ఉద్యోగులను పక్కన పెట్టి హవా వెలగబెడుతున్నారు. డిప్యూటేషన్ మీద వచ్చిన కొందరు అధికారుల అండతో అదనపు కీలక బాధ్యతలను కూడా అందిపుచ్చుకుని చక్కబెడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈవెంట్ల ముసుగులో కమీషన్ల రూపంలోనే భారీగా డబ్బులు దండుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

నైపుణ్యమస్తు!

(5వ పేజీ తరువాయి)

తగిన నైపుణ్యం కూడా అవసరం. దీనిని దృష్టిలో పెట్టుకొని సాంకేతిక, డిజిటల్ మార్కెటింగ్ రంగాలకు సంబంధించి సుమారు 16 అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. బిజినెస్ ప్రాసెస్ మేనేజ్‌మెంట్ (బీపీఎం -నా స్కామ్), వెబ్ సర్వీసెస్(అమెజాన్), మిలియన్ లెర్నర్స్, ఎంఎస్ ఆఫీస్ (నా స్కామ్), ఏఐ (అసెండ్), సాఫ్ట్ స్కిల్స్, డిజిటల్ మార్కెటింగ్, పైథాన్, డిజిటల్ 101 (నా స్కామ్), జావా, సాఫ్ట్ స్కిల్స్ (ఉన్నతి), హార్డ్‌వేర్ నెట్‌వర్కింగ్, టాలీ - జీఎస్టీ, సేల్స్ అండ్ మార్కెటింగ్ ట్రైనింగ్ (హిందుస్థాన్ కోకో కోలా బేవరేజెస్), కంప్యూటర్ ఫండమెంటల్స్ వంటి కోర్సులలో శిక్షణ కల్పిస్తున్నారు. జిల్లాలో అత్యధికంగా బిజినెస్ ప్రాసెస్ మేనేజ్‌మెంట్ (బీపీఎం) కోర్సులు పట్ల అత్యధికంగా విద్యార్థులు ఆసక్తి చూపిస్తున్నారు. దాదాపుగా 1,814 మంది ఈ కోర్సును నేర్చుకోవడానికి ఆయా కాలేజీలలో రిజిస్టర్ అయ్యారు. ఈ కోర్సులలో జాయిన్ అయిన వారంతా కూడా విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్నారు. వీరికి ఇంకా సర్టిఫికెట్లు అందించాల్సి ఉంది. రెండో అత్యధికంగా అమెజాన్ అందిస్తున్న వెబ్ సర్వీసెస్‌కు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వీరిలో 373 మంది శిక్షణ పూర్తి చేసుకున్నారు. మరో 286 మంది శిక్షణ పొందుతున్నారు. ఆ తర్వాత ఎంఎస్ ఆఫీస్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెంట్, పైథాన్, జావా డిజిటల్ మార్కెటింగ్ కోర్సుల పట్ల ఎక్కువగా ఆసక్తి చూపించారు.

జిల్లాలో 15 కాలేజీల ఎంపిక

ఈ కోర్సులను అందించడానికి ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం జిల్లా వ్యాప్తంగా 15 కాలేజీలను ఎంపిక చేసుకుంది. ప్రతిభ మోడల్ డిగ్రీ కాలేజి (తిరువూరు), కేబీఎన్ డిగ్రీ కాలేజి (విజయవాడ), సయ్యద్ అప్పలస్వామి డిగ్రీ కాలేజి (విజయవాడ), ప్రభుత్వ డిగ్రీ కాలేజీ (విజయవాడ), ఎస్ఆర్ఆర్ కాలేజీ (విజయవాడ), నలంద డిగ్రీ కాలేజీ (విజయవాడ), దుర్గా మల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాల (విజయవాడ), ఆంధ్రా లయోలా కాలేజీ-పీజీ (విజయవాడ), ఆంధ్రా లయోలా కాలేజీ - అటానమస్ (విజయవాడ), పీబీ సిద్ధార్థ కాలేజీ (విజయవాడ), జాకీర్ హుస్సేన్ కాలేజీ (ఇబ్రహీంపట్నం), ఎల్‌హెచ్ఆర్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ (మైలవరం), ఎస్‌జీఎస్ కాలేజీ (జగ్గయ్యపేట)లలో ఈ కోర్సులకు సంబంధించి అత్యున్నత శిక్షణ ఇస్తున్నారు.

నిరుద్యోగులకు జాబ్ ఫెయిర్స్‌తో ఉద్యోగాల కల్పన

జిల్లా వ్యాప్తంగా ఏడు నియోజకవర్గాల్లో పదిచోట్ల జాబ్ మేళాలు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ పది చోట్ల మొత్తం 28 జాబ్ ఫెయిర్స్ నిర్వహించారు. జాబ్ ఫెయిర్స్‌కు 2,303 మంది అభ్యర్థులు హాజరు కాగా, 905 మందికి ఉద్యోగాలు వచ్చాయి.



బాలికను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

తప్పిపోయిన బాలిక తల్లిదండ్రులకు అప్పగింత

నందిగామ, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : దిక్కుతోచని స్థితిలో ఉన్న బాలికను శక్తి టీమ్ ఆదుకుని తల్లిదండ్రులకు అప్పగించిన ఘటన నందిగామలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తల్లిదండ్రుల నుంచి తప్పిపోయిన బాలిక(13) శుక్రవారం రాత్రి పట్టణ శివారు అనాసాగరం చేరుకుంది. అక్కడ ఓ ఫంక్షన్‌లో భోజనం చేసి దీనంగా చూస్తుండడంతో స్థానికులు వివరాలు అడిగారు. బాలికకు తెలుగు రాకపోవడంతో గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ అభిమన్యు నేతృత్వంలో శక్తి టీమ్ పాప నుంచి వివరాలు సేకరించేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి చిరునామా ట్రేస్ చేశారు. బాలిక పేరు మమతాదేవిగా గుర్తించి బిహార్ రాష్ట్రానికి చెందినదిగా నిర్ధారించుకున్నారు. బీహార్ అజమ్‌నగర్ సీఐ సహాయంతో పాప తల్లిదండ్రుల వివరాలు సేకరించారు. పాప తల్లిదండ్రులు రీతాదేవి, శివనారాయణ సాహూ అని, ఉపాధి కోసం పలురాష్ట్రాలు తిరుగుతూ ఉంటారని తెలిపారు. తమ కుమార్తె నందిగామ స్టేషన్‌లో ఉందన్న విషయం తెలుసుకొని తల్లిదండ్రులు హుటాహుటిన తరలివచ్చారు. కుమార్తెను అప్పగించిన ఎస్ఐ అభిమన్యుకు, శక్తిటీమ్ సభ్యురాలు కవిత, ఎస్ఐ రవికుమార్‌లకు వారు ధన్యవాదాలు తెలిపారు.

బీహార్ రాష్ట్రం నుంచి పొట్టకూటి కోసం శివనారాయణ సాహూ దంపతులు కుమార్తె మమతతో కలిసి విజయవాడ సమీపంలోని గంగూరు వచ్చి తాపీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నం సాహూ దంపతులు పనికి వెళ్లగా 13 ఏళ్ల కుమార్తె అక్కడి నుండి తప్పిపోయింది. రాత్రి సమయానికి అనాసాగరం చేరుకుంది. సాహూ దంపతులు రాత్రి సమయానికి కూడా కుమార్తె ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందారు. వేల కిలోమీటర్ల మేర పొట్టకూటి కోసం వచ్చి ఇటువంటి దుస్థితిని ఎదుర్కోవడం చూపరులను కలచి వేసింది.

బ్యాంకు మేనేజర్ ఆత్మహత్య!

» మృతిపై భిన్న కథనాలు


సంగీతరావు (ఫైల్)

జగ్గయ్యపేట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : తిరువూరులో ఓ ప్రైవేట్ బ్యాంకు మేనేజర్‌గా పనిచేస్తున్న వేల్పుల సంగీతరావు ఆదివారం ఉదయం పట్టణ పరిధిలోని తొర్రగుంటపాలెంలో తన నివాసంలో బలవన్మరణానికి పాల్పడ్డాడు. జగ్గయ్యపేట ఎస్ఐ జి.రాజు తెలిపిన వివరాల ప్రకారం.. సంగీతరావు (35) ఆదివారం ఉదయం సుమారు 7 గంటలకు భార్య, కుమారుడు నిద్రిస్తుండగా, వేరే గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. కొద్ది సేపటికి గమనించిన భార్య ఇరుగుపొరుగును పిలిచి తలుపులు తీయించి జగ్గయ్యపేట ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతిపై భిన్న కథనాలు వినబడుతున్నాయి. పెనుగంచిప్రోలుకు చెందిన సంగీతరావు జగ్గయ్యపేట బ్రాంచిలో పనిచేస్తున్నప్పటి నుంచి తొర్రగుంటపాలెంలో నివాసం ఉంటున్నాడు. తొర్రగుంటపాలెంకు చెందిన ఓ మహిళతో వివాహేతర సంబంధం గురించి భర్యకు తెలియటంతో వివాదాలు జరుగుతున్నాయని, బ్యాంకులో అవకతవకలు కూడా ఓ కారణమని తెలుస్తోంది. మృతుడి తల్లి శాంతమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

యువకుడి దారుణ హత్య!

జగ్గయ్యపేట రూరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : తిరుమలగిరి శివారులో యువకుడి దారుణహత్య స్థానికంగా కలకలం రేపింది. మృతుడు తెలంగాణాలోని సూర్యాపేట జిల్లా కోదాడకు చెందిన షేక్ నాగుల్‌మీరా అలియాస్ ఫిరోద్ (23)గా గుర్తించారు. చిల్లకల్లు ఎస్ఐ తోట సూర్యశ్రీనివాస్ కథనం మేరకు.. నాగుల్‌మీరా కోదాడలో వెల్డింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తుంటాడని, శనివారం సాయంత్రం ఇద్దరు వ్యక్తులు వచ్చి తమ కుమారుడిని బైకుపై తీసుకెళ్లటం వరకే తమకు తెలుసని, వారు స్నేహితులు అనుకున్నామని మృతుడి తల్లిదండ్రులు పోలీసులకు తెలిపారు. మృతుడి జేబులో కొద్దిమొత్తంలో గంజాయి లభించినట్టు సమాచారం. అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందాడని స్థానికుల ఫిర్యాదు మేరకు సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ సూర్యశ్రీనివాస్ దర్యాప్తు చేసి పంచనామా అనంతరం పోస్టుమార్టం నిమిత్తం జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

పెదపట్నంలో భూముల రగడ!

(5వ పేజీ తరువాయి)

వహిస్తారని సర్వేయర్‌తో గ్రామస్థులు వాదనకు దిగారు. ఈ రోజు సర్వే పనులను అడ్డుకున్నా, ఒకటి రెండు రోజుల్లో సర్వే చేస్తామని సర్వేయర్ గ్రామస్థులతో బెదిరింపు ధోరణితో మాట్లాడటంతో గ్రామస్థులు మరింతగా ఎదురు తిరిగారు. దీంతో ఆదివారం జరగాల్సిన సర్వే పనులు నిలిచిపోయాయి.

తాళ్లపాలెంలో జోరుగా బుసక తవ్వకాలు

తాళ్లపాలెం పంచాయతీ పరిధిలోని పల్లెపాలెంలోని భూముల నుంచి బుసక అక్రమ రవాణాకు వైసీపీ నాయకుడు ఒకరు అధికార పార్టీ నాయకుడి పేరును అడ్డుపెట్టి తెరలేపారు. ఓ వృద్ధురాలి సొంత పొలంలో నుంచే బుసకను తవ్వి ఆమె ఇంటి ఆవరణను మెరక చేసుకుంటామని చెప్పి బుసక తవ్వకాలు ప్రారంభించారు. దీంతో అధికారులు సూచనప్రాయంగా అంగీకరించారు. ఇదే అదనుగా భావించిన సదరు వైసీపీ నాయకుడు భారీగా యంత్రాలు, ట్రాక్టర్లు పెట్టి బుసకను తవ్వి విక్రయాలు జరిపేస్తున్నాడు. రెండు రోజుల పాటు రాత్రి, పగలు తేడా లేకుండా వందలాది ట్రాక్టర్ల బుసకను తరలించి చుట్టు పక్కల గ్రామాల్లో విక్రయించేసినట్లు సమాచారం. ఈ విషయంపై గ్రామస్థులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తే వీఆర్ఏను పంపుతామని చెప్పి, సాగదీత ధోరణితో వ్యవహరించడం గమనార్హం. ఈ వ్యవహారంలో పెద్దమొత్తంలో నగదు చేతులు మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పెట్టుబడికి రెట్టింపు అంటూ రూ.కోట్లతో పరార్!

(5వ పేజీ తరువాయి)

నుంచి వసూలు చేసినట్టు తెలుస్తోంది. ఈ డబ్బులను జమ చేయడానికి సత్యనారాయణపురంలోని యాక్సిస్ బ్యాంక్‌కు చెందిన మూడు ఖాతాల్లో ఈ డబ్బులను జమ చేయించుకున్నట్టు సమాచారం. ఇప్పటి వరకు బాధితులు తమ డబ్బుల కోసం ఫోన్ చేసినా, సందేశాలు పంపినా స్పందించని కిరణ్ ఇప్పుడు నేరుగా సెల్ఫీ వీడియోలో ప్రత్యక్షమయ్యాడు. తాను ఇప్పటికీ సచ్చీలుడునేనని చెప్పుకొచ్చాడు. తన సమయమంతా ఫోన్లు చేసిన వారికి సమాధానాలు చెప్పడానికే సరిపోతుందని, తనకు ఇతర సంస్థల నుంచి డబ్బులు అందగానే అందరికీ చెల్లింపులు చేస్తానని వీడియోలో వివరించాడు. ఇక నుంచి పెట్టుబడిదారులతో నిత్యం పది నిమిషాలు మాట్లాడతానని భరోసా ఇచ్చాడు. ప్రజల నుంచి వసూలు చేసిన డబ్బులతో కిరణ్ తన ఇద్దరు సన్నిహితులతో రెండు వేర్వేరు కంపెనీలు ఏర్పాటు చేయించినట్టు ఆరోపణలు ఉన్నాయి. పోలీసులు అరెస్టు చేసి కిరణ్‌ను జైలుకు పంపితే తమకు నయా పైసా రాదని భావించిన బాధితులు కొందరు ఇంకా అతడి మాయలోనే ఉన్నారు. సత్యనారాయణపురం పీఎస్‌లో ప్రస్తుతం ఇద్దరు బాధితులు మాత్రమే ఫిర్యాదు చేశారు. కిరణ్‌పై ఇప్పటికే గుంటూరు జిల్లాలో పలువురు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రజల నుంచి వసూలు చేసిన డబ్బులతో తన కుటుంబ సభ్యుల పేరున భారీగా ఆస్తులను కొనుగోలు చేసినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థానికంగా పోలీసులు దర్యాప్తులో ఏవిధంగా అడుగులు వేస్తున్నారన్న విషయాలను కిరణ్‌కు ఇక్కడి నుంచి ఇద్దరు, ముగ్గురు అనుచరులు చేరవేస్తున్నట్టు సమాచారం.

పెనమలూరు
• పెనమలూరు • గన్నవరం

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	135, 144, 155
చికెన్ విత్ స్కిన్	260
చికెన్ స్కిన్‌లెస్	270

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 430

కోదండరామస్వామి ఆలయ అభివృద్ధికి విరాళాలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : రంగయ్యప్పారావుపేటలోని కోదండరామస్వామి దేవస్థాన అభివృద్ధికి దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని అభివృద్ధి కమిటీ కోశాధికారి పరుచూరి సుకన్య అన్నారు. దేవస్థాన అభివృద్ధి నిమిత్తం తుమ్మల రాజ్యలక్ష్మి రూ. 1,01,116, యార్లగడ్డ వెంకట రాంబాబు రూ. 1,21,116, వసంత రామారావు రూ. 1,20,116 విరాళాలను ఆదివారం కమిటీ సభ్యులకు అందజేశారు. ఇప్పటివరకూ దేవస్థాన అభివృద్ధికి రూ.16,43, 734ను విరాళాల రూపంలో అందించిన దాతలకు అభివృద్ధి కమిటీ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పొట్లూరి రాము, వీరపనేని రాజేశ్వరరావు, కొత్తపల్లి రామకృష్ణ, ధనకోటేశ్వరరావు, ప్రసాద్, పరుచూరి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు కూటమి నేతల విస్తృతస్థాయి సమావేశం

పెనమలూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : పోరంకి టీడీపీ కార్యాలయంలో సోమవారం సాయంత్రం టీడీపీ కూటమి పార్టీల శ్రేణుల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది ఒక ప్రకటనలో తెలిపారు. కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, యువత, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకోండి

ఉంగుటూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్నిగ్రామాల్లో అర్హతగల లబ్ధిదారులందరికీ ఇళ్ల స్థలం మంజూరు చేసేందుకు కూటమి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని తహసీల్దార్ జాలాది విమలకుమారి తెలిపారు. ఆమె విలేకరులతో మాట్లాడుతూ, హౌసింగ్ ఫర్ ఆల్ కార్యక్రమంలో భాగంగా అర్హతగల లబ్ధిదారులకు పట్టణంలో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడుసెంట్లు చొప్పున కొత్తగా ఇళ్లస్థలాలు మంజూరు చేసేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు.



విజేతలతో నిర్వాహకులు

చెస్ పోటీల విజేతలు వీరే

పెనమలూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : పోరంకి విజ్ఞాన భారతి పాఠశాలలో ఎస్ఆర్ఆర్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన జిల్లా స్థాయి బాలబాలికల చెస్ పోటీల్లో విజేతలను ప్రకటించారు. బాలుర విభాగంలో హర్షిత్‌సాయి, అబ్దుల్ ఫెయిజ్‌లు మొదటి రెండు స్థానాల్లో నిలవగా బాలికల విభాగంలో నాగశుభశ్రీ, ప్రహస్థలు తొలి రెండు స్థానాల్లో నిలిచారు. విజేతలకు ప్రత్యేక బహుమతులు అందించారు. విజేతలను త్వరలో అండర్ 13 రాష్ట్రస్థాయి పోటీలకు పంపనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. టోర్నమెంట్ అనంతరం జరిగిన అభినందన సభలో విజేతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ శేషాద్రిరావు, జీ వేణు, కరూర్‌వైశ్య బ్యాంకు మేనేజర్ శ్రీనివాస్, ఎస్ఆర్ఆర్ చారిటబుల్ ట్రస్టు రేణుక, కే ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

రక్షణ కోరుతూ పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట

హనుమాన్‌జంక్షన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ సభ్యుల నుంచి ప్రాణహాని ఉందని రక్షణ కల్పించాలని కోరుతూ నెల్లూరుకు చెందిన ప్రేమ జంట శనివారం అర్ధరాత్రి జంక్షన్ పోలీస్ స్టేషన్ ఆశ్రయించారు. మేజర్లు అయిన యువతీ యువకులు ప్రేమించుకున్నారు. పెద్దలు అభ్యంతరం పెట్టడంతో జంట హనుమాన్‌జంక్షన్‌లో యువకుడికి చెందిన బంధువుల వద్దకు చేరుకొని వారి సాయంతో స్థానిక ఏలూరు రోడ్డు మసీదు కమిటీ పెద్దల సమక్షంలో వివాహం చేసుకున్నారు. అనంతరం పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు. కాగా నెల్లూరు 1టౌన్ పోలీస్‌స్టేషన్‌లో యువతి మిస్సింగ్ అయినట్లు ఆమె కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. దీంతో నెల్లూరు పీఎస్‌కు సమాచారం అందించారు. నెల్లూరు పీఎస్ నుంచి కానిస్టేబుల్ ఆదివారం రావడంతో ప్రేమ జంటను ఎస్సై వి.సురేశ్ వారికి అప్పగించారు.

నేడు శ్రీనివాస కల్యాణం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : గన్నవరంలోని శ్రీపంచ తత్వ గురుపాదుకా నిలయంలో సోమవారం శ్రీనివాస కల్యాణం నిర్వహించనున్నట్లు గణపతి సచ్చిదానంద సమాతా జ్ఞానబోధ సభ మాతృ మండలి ట్రస్ట్ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ద్వారకాతిరుమల సుదర్శన శ్రీనివాసచార్యులు, శిష్యబృంద ఆధ్వర్యంలో లోకకల్యాణార్థం సోమవారం ఉదయం శ్రీనివాస కల్యాణం నిర్వహిస్తారని పేర్కొన్నారు.

కార్మిక దినోత్సవ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

పెనమలూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : పోరంకి ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ కార్మిక దినోత్సవ వాల్ పోస్టరును ఆవిష్కరించారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు అనుమోలు ప్రభాకరరావు, కోయ ఆనంద్‌ప్రసాద్, తుమ్మల రాంకుమార్, టీఎన్టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొసరాజు మల్లేశ్వరరావు, పెనమలూరు అధ్యక్షుడు టంటం సత్యనారాయణ, ముప్పల జోజి, కొసరాజు శివఅప్పారావు, ఇస్లావత్ నర్సింహరావు, గూడవల్లి శ్రీహరి, ఆరేపల్లి గోపి పాల్గొన్నారు.



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

ఇరుకు కల్వర్టుతో ఇక్కట్లు!

తరచూ ప్రమాదాలు.. పలువురికి గాయాలు

(ఉయ్యూరు -ఆంధ్రజ్యోతి)

ఉయ్యూరు- కాటూరు రోడ్డులో హనుమాన్ నగర్‌వద్ద ఇరుకుగా ఉన్న కల్వర్టువల్ల తరచూ ప్రమాదాలు జరిగి పలువురు గాయాలపాలవుతున్నారు. ఉయ్యూరు నుంచి కాటూరు, తేలప్రోలు, గుడివాడ, ముదునూరు, అప్పికట్ల, గుడివాడ వైపు వెళ్లే వాహనాలతో పాటు విజయ వాడ-మచిలీపట్నం హైవే వైపు వెళ్లే వాహనాలతో అనునిత్యం రద్దీగా ఉండే రోడ్డులో హనుమాన్ నగర్ అంజనేయస్వామి ఆలయం సమీపాన ఎన్నో సంవత్సరాల క్రితం పంటకాల్వపై కల్వర్టు ఇరుకుగా ఉండటమే కాక శిథిలావస్థకు చేరుకుంది. ఈ నేపథ్యంలో వాహనాల రద్దీ పెరిగి కల్వర్టు వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయి. హనుమాన్‌నగర్ వాసులు కూడా రోడ్డు దాటే సమయంలో కల్వర్టు వద్ద ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నూతన కల్వర్టు వెడల్పుగా నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.



ఉయ్యూరు- కాటూరు రోడ్డులో హనుమాన్‌నగర్ వద్ద ఇరుకుగా ఉన్న కల్వర్టు

తాడిగడప అభివృద్ధికి ప్రథమ ప్రాధాన్యం

పెనమలూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : తాడిగడప మునిసిపాలిటీ అభివృద్ధికి ప్రథమ ప్రథమ ప్రాధాన్యం ఇస్తానని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. ఆదివారం తాడిగడపలో రెండు సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తాడిగడపను మునిసిపాలిటీగా ఏర్పాటు చేసి గత ప్రభుత్వం మునిసిపాలిటీ పేరుతో పన్నులు పెంచి వసూలు చేసిందే తప్ప అభివృద్ధి వైపు కన్నెత్తి చూడలేదన్నారు. కనీసం కానూరు ప్రధాన రోడ్డునూ అభివృద్ధి చేసిన పాపాన పోలేదన్నారు. కొద్దిపాటి వర్షాలకే కానూరు రోడ్డులో మోకాలి లోతున నీళ్లు నిలిచి ఎక్కడా లేని విధంగా స్థానికులు ఇబ్బందులు పడ్డ పరిస్థితులు చూశామన్నారు. అందువల్లే ఇప్పుడు వేసే రోడ్లు ఎత్తు పెంచి వర్షపు నీటిని డ్రెయిన్ల ద్వారా వెళ్లిపోయే విధంగా నిర్మించడం జరుగుతుందన్నారు. తాడిగడపలోని కిలారు శ్రీరాములు కాలనీ నుంచి తాడిగడప సర్కిల్ వరకు 13లక్షల వ్యయంతో సీసీ రోడ్డు, మౌలాలీ హౌస్ నుంచి దాశరథి హౌస్ వరకు 26.4లక్షల వ్యయంతో నిర్మించనున్న మరో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ తాడిగడప మునిసిపాలిటీ అధ్యక్షుడు అను మోలు ప్రభాకరరావు, టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు తుమ్మల రాంకుమార్, పీతా గోపీచంద్, మేడసాని రత్నకుమారి, నర్రా చంటి, మన్నె రాజబాబు, మొవ్వా నరేంద్ర, కొక్కిలిగడ్డ సాంబశివరావు, లంకే రాము, పీతా శ్రీను, సైకం చాణక్య, మహమ్మద్ సాదిక్, నాగుల్‌మీరా పాల్గొన్నారు.

తాడిగడప సెంటర్లో స్థానిక జనసేన నాయకులు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ప్రారంభించారు. కూటమి నాయకులతో కలిసి మునిసిపల్ కార్మికులకు మజ్జిగ పంపిణీ చేశారు.



తాడిగడపలో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

గ్రామాల్లో వైద్యసేవలు అభినందనీయం

కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మల్టీ స్పెషాలిటీ వైద్యసేవలతో పాటు అత్యాధునిక వైద్య పరీక్షలను అందుబాటులోకి తేవడం అభినందనీయమని కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. ఎస్.ఎన్.పాలెంలో ఆదివారం మెడివ్యాలీ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్యశిబిరాన్ని ఆయన పరిశీలించారు. కోట్లాది రూపాయల వ్యయంతో మెడివ్యాలీలో ఏర్పాటు చేసిన అత్యాధునిక ల్యాబ్‌ను పరిశీలించి, వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఉచిత వైద్యశిబిరంలో డాక్టర్ సుధా పంచకర్ల(ఈ ఎన్‌టీ), డాక్టర్ పవన్‌సీతారాం (పిల్లల వైద్యనిపుణులు), డాక్టర్ వినీల (గైనకాలజీ), డాక్టర్ జ్యోతిఅభిషేక్ (ఆర్థోపెడిక్), డాక్టర్ జీ.వి.కె.రావు (డయాబెటిక్)లు 275 మందికి ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెడివ్యాలీ చైర్మన్ పంచకర్ల వరప్రసాద్, ఎండీ రమేష్‌చక్రవర్తి, డైరెక్టర్లు సుధ, దొడ్ల కృష్ణమోహన్, పోలిశెట్టి శ్రీనివాస్, కోయ శ్యాం ప్రసాద్ పాల్గొన్నారు.



మెడివ్యాలీలో ఏర్పాటు చేసిన అత్యాధునిక ల్యాబ్‌ను పరిశీలిస్తున్న కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు



వైద్యశిబిరంలో మాట్లాడుతున్న కంకిపాడు ఉప సర్పంచ్ రాచూరి చిరంజీవి

కంకిపాడు పంచాయతీ కార్యాలయంలో..

కంకిపాడు : గ్రామీణ ప్రాంత ప్రజలకు కార్పొరేట్ వైద్య సేవలందించేందుకు ముందుకు రావడం హర్షణీయమని రాచూరి ఫౌండేషన్, కంకిపాడు ఉప సర్పంచ్ రాచూరి చిరంజీవి అన్నారు. రాచూరి ఫౌండేషన్ సహకారంతో అమెరికన్ కిడ్నీ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో కంకిపాడు పంచాయతీ కార్యాలయంలో ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ, అమెరికన్ కిడ్నీ ఆసుపత్రి వైద్యులు ముందుకొచ్చి పేదలకు కిడ్నీ వైద్య పరీక్షలతో పాటు షుగరు, బీపీ, దీర్ఘకాలిక రోగాలకు సంబంధించిన వైద్య సేవలందించటం హర్షణీయమన్నారు. ఇటువంటి వైద్య సేవలను పేదలు సద్వినియోగ పరుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు అట్లూరి సాయి స్వప్న, నంబూరి ఉషశ్రీ, వార్డు సభ్యులు చిట్టూరి కోటయ్య బాబు, గ్రామస్థులు కంకిపాటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదాన్ని కూకటి వేళ్లతో పెకలించాలి

ఉగ్రదాడులకు నిరసనగా తాడిగడప, బుద్ధవరంలో కొవ్వొత్తుల ర్యాలీ

పెనమలూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : ఉగ్రవాదాన్ని కూకటి వేళ్లతో పెకలించే ప్రయత్నంలో ఉన్న కేంద్ర ప్రభుత్వానికి అన్ని వర్గాల ప్రజలు పూర్తిగా మద్దతు పలకాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. ఆదివారం ఉగ్రవాదానికి వ్యతిరేకంగా మునిసిపాలిటీలోని తాడిగడప గ్రామం నుంచి తాడిగడప సెంటర్ వరకు జరిగిన కొవ్వొత్తుల ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉగ్రవాదుల దాడితో భారతదేశంలోని అన్ని మతాల వారు ఏకతాటిపైకి వచ్చి ఉగ్రచర్యలను ఖండించారని తెలిపారు. తీవ్రవాదం వల్ల అభివృద్ధి జరగదని, తీవ్రవాదంతో ప్రజల జీవనప్రమాణాలు సన్నగిల్లుతాయని పేర్కొన్నారు. తీవ్రవాదానికి వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ గళం విప్పాల్సిన సమయం ఆసన్నమైందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు అనుమోలు ప్రభాకరరావు, కోయ ఆనంద్ ప్రసాద్, ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ, ఎస్సై ఉషారాణి, మేడసాని రత్నకుమారి, కటారి మౌళి, చిట్టిజల్లు, విజయలక్ష్మి, తుమ్మల రాంకుమార్, మనోహర్ బేగ్, షేక్ కరిముల్లా, మౌలాలి, నాగూర్, జానీ, జలీల్ ఖాన్, హఫీజ్ తదితరులు పాల్గొన్నారు.

గన్నవరం (ఉంగుటూరు) : కశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ, అమరులకు నివాళిగా ఆదివారం రాత్రి గన్నవరం మండలం బుద్ధవరం గ్రామంలో సర్పంచ్ బడుగు బాలమ్మ ఆధ్వర్యంలో గ్రామస్థులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. భారత్‌మాతాకీ జై, ఉగ్రవాదం నశించాలి అంటూ నినాదాలు చేస్తూ స్థానిక కమ్యూనిటీ హాలు నుంచి బయలుదేరిన ప్రదర్శన ర్యాలీ గ్రామప్రధాన వీధులగుండా కొనసాగింది. ఈ సందర్భంగా గ్రామపెద్దలు బడుగు మరియదాసు మాట్లాడుతూ, కశ్మీర్ పర్యాటకులపై ఉగ్రవాదులు విచక్షణారహితంగా దాడి చేసి కాల్చిచంపడం హేయమైన చర్య అన్నారు. ఈ సందర్భంగా అమరులకు సంతాపం తెలిపారు. కులమతాలకు అతీతంగా భారతీయులంతా ఒక్కతాటిపై నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గండికోట దశరథరామయ్య, ముద్రబోయిన శ్రీను, కంభంపాటి లక్ష్మి, నక్కా ఆదినారాయణ, ముద్రబోయిన వెంకటేశ్వరరావు, పెయింటర్ శ్రీనివాసరావు, గండికోట వెంకటేశ్వరరావు, పేరిచర్ల నాగుల్‌మీరా, నక్కా బ్రహ్మం, తల్లిబోయిన జ్యోతి, మురళి రమాదేవి పాల్గొన్నారు.



ఉగ్రవాదుల దాడికి నిరసనగా బుద్ధవరంలో కొవ్వొత్తుల ర్యాలీ

పంట కాలువలో చెత్త తొలగింపు

గుడివాడ, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : మల్లాయిపాలెం శివారు టిడ్కో కాలనీ వద్ద లేళ్లపూడి నార్త్‌సైడ్ కాలువలో నీటి ప్రవాహానికి అడ్డుగా భారీస్థాయిలో పేరుకుపోయిన చెత్త చెదారాన్ని ఆదివారం ఇరిగేషన్ అధికారులు తొలగించారు. బీజేపీ టూటౌన్ అధ్యక్షుడు మాచర్ల రామకృష్ణ ఇటీవల కాలువ దుస్థితిపై ఇరిగేషన్ అధికారులను కలిసి విన్నవించారు. స్పందించిన అధికారులు ప్రోక్లయిన్ సాయంతో చెత్తను, అడ్డుగా ఉన్న ఇతరత్రా వస్తువులను తొలగించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు లంకా రాంబాబు, రాజు, గాదె చరణ్, కార్యకర్తలు పాల్గొన్నారు.



గన్నవరం విమానాశ్రయంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న బీజేపీ నేతలు

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి ఘనస్వాగతం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ జయంతి వేడుకల్లో పాల్గొనేందుకు విజయవాడ వస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి గన్నవరం విమానాశ్రమంలో బీజేపీ నేతలు ఆదివారం సాదరస్వాగతం పలికారు. బీజేపీ రాష్ట్ర మీడియా ఇన్‌చార్జి, గుంటూరు జెడ్పీ మాజీ చైర్మన్ పాతూరి నాగభూషణం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, వల్లూరు జయప్రకాష్, ఆర్డీ విల్సన్, షేక్ బాజీ, కుమారస్వామి, దేవానంద్, శ్రీనివాసరాజు, పీయూష్‌దేశాయ్, వెంకట సుబ్బారావు, వెంకటకృష్ణ, శేషకుమార్, రాజశేఖరరెడ్డి పాల్గొన్నారు.

గతం కంటే ఘనంగా హనుమజ్జయంతి

ఈవో తారకేశ్వరరావు

హనుమాన్‌జంక్షన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : స్థానిక అభయాంజనేయ స్వామి దేవస్థానంలో మే 17నుంచి 22 వరకు నిర్వహించనున్న హనుమజ్జయంతి ఉత్సవాలను గత ఉత్సవాలు కంటే ఘనంగా నిర్వహించడానికి సన్నాహాలు ముమ్మరం చేస్తున్నట్లు ఆలయ ఈవో తారకేశ్వరరావు ఆదివారం తెలిపారు. గత ఉత్సవాలను దాదాపు రూ.18లక్షలతో నిర్వహించారని, ఈ ఉత్సవాలను కూడా ఏ మాత్రం తగ్గకుండా నిర్వహించాలన్నది గ్రామ పెద్దలు ఆలోచన అని, గ్రామ టీడీపీ నాయకులు వేమూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఇప్పటికే గ్రామ పెద్దలతో రెండు సమావేశాలు నిర్వహించామని తెలిపారు. ఉత్సవాల్లో ఏఏ కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్న దిశగా సమాలోచనలు చేశామని, కళాకారులు, నిర్వాహకుల నుంచి కొటేషన్లు స్వీకరించామని ఆయన తెలిపారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్‌బర్డ్	135, 144, 155
చికెన్ విత్ స్కిన్	260
చికెన్ స్కిన్‌లెస్	270

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 430

ఇస్రో శాస్త్రవేత్త శ్రీధర్‌కు ఘన సత్కారం

గుడివాడ, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సత్యనారాయణపురంలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్లో చంద్రయాన్ ప్రాజెక్టు ఇస్రో శాస్త్రవేత్త రాజాశ్రీధర్‌ను మానవతా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మానవతా స్వచ్ఛంద సంస్థ గుడివాడ అధ్యక్షులు అన్నపురెడ్డి గోపిరెడ్డి, ఉపాధ్యక్షులు దండమూడి సీతారామస్వామి, జిల్లా అధ్యక్షురాలు దండమూడి జయలక్ష్మీ, సభ్యులు దుద్దు వెంకటేశ్వరరావు, ఇంజినీరింగ్ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ సురేంద్రబాబు, అసిస్టెంట్ ప్రొఫెసర్ నవీన్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



శ్రీధర్‌ను సత్కరిస్తున్న మానవతా స్వచ్ఛంద సంస్థ సభ్యులు

ప్రజలకు జవాబుదారీగా పనిచేస్తా

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి) : గుడివాడ ప్రజలకు జవాబుదారీగా పనిచేస్తానని, అభివృద్ధికి వారితో కలిసి అడుగులు వేస్తానని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. మీ కోసం-మీ వెనిగండ్ల ఉదయపు పర్యటనలో భాగంగా ఆదివారం స్థానిక 7వవార్డులోని కొత్తపేట తదితర ప్రాంతాల్లో ద్విచక్రవాహనంపై పర్యటించారు. రోడ్లు, డ్రెయినేజీ సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. దశాబ్దాలుగా పరిష్కారానికి నోచుకోని సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కూటమి నాయకులు కునుకు మోహన్, ఏడుకొండలు, పెద్ది కిషోర్, మంగరాజు, పాల్గొన్నారు.

బీసీ నాయకుడు దారం మృతి తీరనిలోటు

ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన బీసీ నాయకుడు దారం నరసింహరావు కుటుంబసభ్యులను ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పరామర్శించారు. ఆదివారం స్థానిక ఏలూరురోడ్డులోని దారం నివాసంలో తొలుత దారం చిత్రపటానికి ఆయన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ నాయకులు దారం లేని లోటు తీర్చలేనిదన్నారు. గత ఎన్నికల్లో తన విజయానికి దారం ఎంతగానో కృషి చేసారని గుర్తు చేశారు. దారం కుటుంబానికి టీడీపీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే వెనిగండ్ల హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దారం కుటుంబసభ్యులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



దారం నరసింహరావు కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల



ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన గుడ్లవల్లేరు మార్కెట్ యార్డు మహిళ డైరెక్టర్లు

స్థానిక రాజేంద్రనగర్‌లోని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము స్వగృహంలో గుడ్లవల్లేరు మార్కెట్ యార్డు మహిళ డైరెక్టర్లు తూము పద్మజ, గడ్డం బాలాకుమారి, తెల్లకుల నాగలక్ష్మీలు విదేశీ పర్యటన ముగించుకుని వచ్చిన ఎమ్మెల్యే వెనిగండ్లను మర్యాదపూర్వకంగా కలిశారు.



లయన్స్‌క్లబ్ సభ్యులు ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

బాలుడికి ఆర్థిక సాయం

గుడివాడ, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : లయన్స్ క్లబ్ ఆఫ్ గుడివాడ ప్రగతి ఆధ్వర్యంలో పూర్వ అధ్యక్షులు రవీంద్రనాథ్ ఇంటి సమీపంలో టైరుకు పంక్చర్ వేస్తూ గాయపడిన శంకర్ అనే యువకుడికి క్లబ్ అధ్యక్షులు నల్లారి శేషగిరిరావు, అన్నే నవీన్, వై.రవీంద్రనాథ్, విజయభాస్కర్, ఆర్.వేణుబాబు, కె.వి రమణ, ఎం.వీరశేఖర్‌ల సహకారంతో రూ.7వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కోశాధికారి రవికుమార్, సభ్యులు కృష్ణారాజు, దుర్గకాంత్ తదితరులు పాల్గొన్నారు.



చెత్తను తొలగిస్తున్న ఇరిగేషన్ సిబ్బంది

పంట కాలువలోని చెత్త తొలగింపు

గుడివాడ, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : మల్లాయిపాలెం శివారు టిడ్కో కాలనీ వద్ద లేళ్లపూడి నార్త్‌సైడ్ కాలువలో నీటి ప్రవాహానికి అడ్డుగా భారీస్థాయిలో పేరుకుపోయిన చెత్త చెదారాన్ని ఆదివారం ఇరిగేషన్ అధికారులు తొలగించారు. బీజేపీ టూటౌన్ అధ్యక్షుడు మాచర్ల రామకృష్ణ ఇటీవల కాలువ దుస్థితిపై ఇరిగేషన్ అధికారులను కలిసి విన్నవించారు. స్పందించిన అధికారులు ప్రోక్లయిన్ సాయంతో చెత్తను, అడ్డుగా ఉన్న ఇతరత్రా వస్తువులను తొలగించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు లంకా రాంబాబు, రాజు, గాదె చరణ్, కార్యకర్తలు పాల్గొన్నారు.



పూర్ణచంద్రికకు ఆర్థిక సాయం అందజేస్తున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు

ఇంజనీరింగ్ విద్యార్థికి ఆర్థిక సాయం

గుడివాడ, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి) : ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సర విద్యార్థి నేరెళ్ల పూర్ణచంద్రికకు రూ.5వేలు ప్రోత్సాహక బహుమతిని మానవతా స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు అందజేశారు. ఆదివారం స్థానిక మానవతా స్వచ్ఛంద సంస్థ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. మానవతా కార్యాలయ నిర్మాణానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన వల్లభనేని కిషోర్ రూ.5116లు, సీతామహాలక్ష్మీ రూ.5116లు, గుత్తా రాంప్రసాద్, నళిని దంపతులు వారి కుమారుడు దివంగత గోపీకృష్ణ జ్ఞాపకార్థం రూ.5001లు వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షురాలు దండమూడి జయలక్ష్మీ, గుడివాడ అధ్యక్షుడు అన్నపురెడ్డి గోపీరెడ్డి, ఉపాధ్యక్షులు దండమూడి సీలతారామస్వామి, పూర్వ అధ్యక్షులు గుత్తా రమేష్, కన్వీనర్ ఉప్పలపాటి మారుతీప్రసాద్, కార్యదర్శి నందమూరి పద్మజ, రామ్మోహనరావు, తిరుపతయ్య, ఉదయభాస్కరరాజు, కూచిపూడి సత్యం, గుత్తా లక్ష్మీ, కఠారి లక్ష్మీ, రాధ, శైలజ, తదితరులు పాల్గొన్నారు.

జనసేన బలోపేతమే ధ్యేయం : బూరగడ్డ

గుడివాడ, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో జనసేనని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బూరగడ్డ శ్రీకాంత్ అన్నారు. ఆదివారం స్థానిక ఆంజనేయపేటలోని నియోజకవర్గ కార్యాలయంలో మంగళగిరి రాష్ట్ర కార్యాలయం నుంచి వచ్చిన ప్రతినిధులు అక్షయ్, అభినయ్‌లతో కలిసి క్రియాశీలక సభ్యత్వ ఐడీ కార్డుల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రియాశీలక సభ్యత్వాలు ఐడీ కార్డులు ప్రతి కార్యకర్తకు అందే విధంగా పార్టీ కార్యాలయం నుంచి ఐడీ కార్డులను పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మజ్జి శ్రీనివాసరావు, వేమూరి త్రినాథ్, సాయన రాజేష్, ఐ.టి కో-ఆర్డినేటర్ చింతా రామకృష్ణ, క్రియాశీలక వాలంటీర్లు సుంకర వెంకట్, సీతారాం, ఘంటా వంశీ, సాయికృష్ణ, కె.సాయి, కె.కొండ, ఎం.కిషోర్, బుడమా రాజు, నల్లి భవాని, కొట్టె శివ, వీర మహిళలు సౌమ్య, శిరీషా పాల్గొన్నారు.



సభ్యత్వకార్డులను అందజేస్తున్న శ్రీకాంత్

మేడే వేడుకలను జయప్రదం చేయండి

● నార్ల వెంకటేశ్వరరావు

గుడివాడ, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : మేడే వేడుకలను ఘనంగా నిర్వహించాలని, మే నెలలోనే శాఖ, నియోజకవర్గ మహాసభలను నిర్వహించాలని జిల్లా సీపీఐ కార్యదర్శి నార్ల వెంకటేశ్వరరావు కోరారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో నియోజకవర్గ కమిటీ సమావేశాన్ని నియోజకవర్గ కార్యదర్శి గూడపాటి ప్రకాష్‌బాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ హయాంలో జరిగిన కుంభకోణాలు ఒక్కోటిగా బయటకు వస్తున్నాయన్నారు. నేటి వరకు పాలించిన రాజకీయ పార్టీలు పేదల శ్రమను దోచుకున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ప్రకటించిన సూపర్ సిక్స్ వాగ్దానాల్లో మహిళందరికి ఉచిత బస్సు సౌకర్యం, తల్లికి వందనం పథకాలను నేటివరకు అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. ఈ సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్, నియోజకవర్గ సహాయ కార్యదర్శి సి.హెచ్ సత్యనారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు



ఉచిత వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

గుడివాడ రూరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించే విషయంలో గణేష్ హాస్పటల్ ఎప్పుడూ ముందుంటుందని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని యూరాలజిస్ట్ సర్జన్ డాక్టర్ యలవర్తి పవన్ గణేష్ తెలిపారు. పామర్రు రోడ్డులోని క్వాలిటీ ఫీడ్స్‌లో చుట్టూపక్కల ఉన్న ఐదు గ్రామాలకు, క్వాలిటీ ఫీడ్స్‌లో పని చేస్తున్న 200 కుటుంబాలకు ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ గణేష్ మాట్లాడుతూ గణేష్ హాస్పటల్ ఏర్పాటు చేసిన గుడివాడలో కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందించనున్నామన్నారు. పేద ప్రజలకు తమవంతు వైద్య సేవ అందించాలనే సదుద్దేశ్యంతో నేడు క్వాలిటీ ఫీడ్స్ వారి సహకారంతో ఉచిత వైద్యశిబిరం నిర్వహించామన్నారు. సుమారు 10 రకాల ఉచిత వైద్య పరీక్షలతోపాటు ఈసీజీ, క్యాన్సర్ కణాల గుర్తింపు పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య శిబిరం విజయవంతం అయ్యేందుకు సహకరించిన డాక్టర్ గోర్జి పృథ్వీ, డాక్టర్ దివ్యకు తమ హాస్పటల్ తరపున ధన్యవాదాలు తెలియజేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్వాలిటీ ఫీడ్స్ నిర్వాహకులు, హాస్పటల్స్ సిబ్బంది పాల్గొన్నారు.



రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

సింగలూరులో సైక్లింగ్ క్లబ్ బృందం పర్యటన

గుడ్లవల్లేరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : సింగలూరు గ్రామంలో ఆదివారం గుడివాడ సైక్లింగ్ క్లబ్ సభ్యులు హల్‌చల్ చేశారు. గుడివాడకి చెందిన ప్రముఖ వైద్యులు గుడివాడ సైక్లింగ్ క్లబ్‌ను నిర్వహిస్తున్నారు. ఆదివారం ఆ సైక్లింగ్ క్లబ్ సభ్యుల బృందం సింగలూరు గ్రామానికి వెళ్లారు. గ్రామానికి చెందిన ప్రముఖ దంత వైద్యులు డాక్టర్ బండారు శ్యామ్‌కుమార్ వారికి స్వాగతం పలికారు. తొలుత వివేకానందుని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామస్థులచే నిర్వహించే గ్రంథాలయం, వాటర్‌ప్లాంట్, భాగ్యవిధాతా చారిటబుల్ ట్రస్ట్ భవనం, మహిళలచే నిర్వహించే ఎకోఫ్రెండ్లీ ఇస్తరాకుల కర్మాగారాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ గుడివాడ అధ్యక్షులు డాక్టర్ మాగంటి శ్రీనివాస్, డాక్టర్ పొట్లూరి వంశి, డాక్టర్ ఉండవల్లి సురేష్‌బాబు, డాక్టర్ అనురాధ, డాక్టర్ పిన్నమనేని రామకృష్ణప్రసాద్, డాక్టర్ సూరజ్,డాక్టర్ పూర్యశరణ్ కుమార్, డాక్టర్ అంకిత, రావి హర్ష,అవినాష్, శివగుప్తా పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న సైక్లింగ్ క్లబ్ డాక్టర్ల బృందం

నివేశనా స్థలాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

కూచిపూడి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మొవ్వ మండలంలోని 16 సచివాలయాల పరిధిలో గల 21 గ్రామపంచాయతీల్లో అర్హులైన లబ్ధిదారులు ప్రభుత్వం అందించే నివేశనాస్థలాల కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల తహసీల్దార్ కె.మస్తాన్ తెలిపారు. ఏపీ రాష్ట్ర ప్రభుత్వం జీఎంఎస్ నెంబర్ 23 రెవెన్యూ ల్యాండ్స్ డిపార్ట్‌మెంట్ ప్రకారం హౌసింగ్ ఫర్ ఆల్ కార్యక్రమంలో భాగంగా నివేశనాస్థలాలు అందించనున్నట్టు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో అర్హులైన వారు సమీపంలోని సచివాలయాల్లో స్థలాల మంజూరు కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

ఐఎంఏ నూతన అధ్యక్షుడికి ఘనసత్కారం

గుడివాడ, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ మెడికల్ అసోసియేషన్ గుడివాడ శాఖ అధ్యక్షుడిగా ఎన్నికైన డాక్టర్ మాగంటి శ్రీనివాస్‌ను ఆయన స్వగృహంలో ఆదివారం గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆర్ఎంపీ వైద్యులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ గ్రామీణ వైద్యులు ప్రజలకు ప్రాథమిక వైద్యం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘం గౌరవ సలహాదారు ప్రసాదరావు, బి.హెచ్.ఎం.పి.ఏ రాష్ట్ర నాయకులు నందూరి ఉమాశంకర్, కోలా వెంకటేశ్వరరావు, ఉమ్మడి కృష్ణాజిల్లా అధ్యక్షులు సాగిరాజు ఉదయభాస్కరరాజు, కార్యదర్శి పోలా సింహాచలం, జిల్లా వర్కింగ్ అధ్యక్షులు గుదే నాగచంద్రశేఖర్, గుడివాడ ప్రాంతీయ అధ్యక్షులు వంగా ఎర్రంనాయుడు, కోశాధికారి చీకుర్తి ప్రదీప్‌కుమార్, నాయకులు జె.వి లక్ష్మీనారాయణ, కంభాల శ్రీనివాస్, చల్లా చంద్రశేఖర్, పోలన సురేష్‌బాబు, వై.శివప్రసాద్ పాల్గొన్నారు.



మాగంటి శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న ఆర్ఎంపీ వైద్యుల సంఘం

గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు నేడు

గుడివాడ, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి) : స్థానిక రాజేంద్రనగర్‌లోని శాఖ గ్రంథాలయంలో ఈ నెల 28వ తేదీ నుంచి జూన్ 6వ తేదీ వరకు ఉచిత వేసవి విజ్ఞాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు గ్రంథాలయ అధికారి పి.శాంతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో పిల్లలకు కథలు చెప్పడం, పుస్తకాలు చదివించడం, డ్రాయింగ్ నేర్పించడం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు.

కూచిపూడి : ఈ నెల 28 నుంచి జూన్ 6వ తేదీ వరకు మొవ్వ శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులు ప్రతి రోజూ ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు నిర్వహించనున్నట్టు గ్రంథాలయ అధికారి తూములూరి కృష్ణకుమారి తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.



శిక్షణా శిబిరంలో పాల్గొన్న చిన్నారులు

దోపిడీకి కేరాఫ్ అడ్రస్‌గా ఉన్న వ్యక్తికి పార్టీ పదవా.!

గుడివాడ, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : గుడివాడ నియోజకవర్గంలో అధికారం అనుభవించి అనేక రకాలుగా దోపిడి చేసి పారిపోయిన వ్యక్తికి పార్టీలో కీలక పదవి ఇవ్వడం పట్ల వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు మండలి హనుమంతరావు ఆక్షేపణ తెలిపినట్టు సమాచారం. ఇటీవల వైసీపీకి మండలి పార్టీకి, ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసిన విషయం విదితమే. ఈ క్రమంలో వైసీపీ రాష్ట్ర అధిష్టానం ఆదేశాల మేరకు ఎమ్మెల్సీ తలశిల రఘురాం, మాజీ మంత్రి పేర్ని నానిలు మండలిని బుజ్జగించేందుకు ఆదివారం మండలి స్వగృహానికి విచ్చేశారు. తాను ఎట్టి పరిస్థితుల్లో పార్టీలో కొనసాగే ప్రసక్తే లేదని, రాజీనామాకు కట్టుబడి ఉన్నట్టు మండలి ఖరాఖండిగా తేల్చి చెప్పినట్టు సమాచారం. పార్టీ కోసం కష్టపడిన బడుగు, బలహీనవర్గాల వారి పైనే టీడీపీ వాళ్ల అక్రమ కేసులు బనాయిస్తున్నారని, కనీసం వాటిని పట్టించుకునే స్థితిలో లేకపోవడం బాధాకరమని వాపోయారు. మండలి చెప్పిన అంశాలను పార్టీ అధ్యక్షులు జగన్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళతామని, అప్పటివరకు నిర్ణయాన్ని వాయిదా వేసుకోవాలని మండలి హనుమంతరావును కోరినట్టు సమాచారం.



మండలి హనుమంతరావు

శిథిలావస్థలో నెహరెల్లి వంతెన

● పట్టించుకోని అధికారులు
● భయాందోళనలో ప్రయాణికులు

(ఆంధ్రజ్యోతి - నందివాడ): నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు జనార్ధనపురం నుంచి నందివాడ ఆర్అండ్‌బీ రోడ్డు నెహరెల్లి కాలువ వంతెనపై ప్రయాణిస్తుంటారు. గత నాలుగేళ్లుగా వంతెన సైడ్ గోడలు పడిపోయి శిథిలావస్థలో ఉంది. ఈ వంతెనపై 11 గ్రామాల ప్రజలు మండల కేంద్రమైన నందివాడ ప్రభుత్వ కార్యాలయాలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. వందల సంఖ్యలో నిత్యం ప్రభుత్వ అధికారులు ఈ వంతెనపై తిరుగుతున్నారు. ఏ ఒక్క అధికారి ఈ వంతెన గురించి పట్టించుకోవటం లేదని నందివాడ గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వంతెనపై గోతులు ఏర్పడటంతో కనీసం మోటారు బైక్‌లు సైతం ఎదురుబోదురు తప్పించుకునే పరిస్థితి లే దు. 30, 40 టన్నుల చేపల మేతల లారీల డ్రైవర్లు ప్రాణాలు అర చేతిలో పెట్టుకుని ప్రయాణం సాగిస్తున్నారు. మండల సమావేశాల్లో కొంతమంది ప్రజాప్రతినిధులు ఈ వంతెన గురించి ప్రస్తావించిన ప్రతిసారీ చూద్దాం చేద్దాం అంటూ దాట వేస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. ఇరిగేషన్, ఆర్అండ్‌బీ అధికారులు కానీ స్పందించటం లేదని ప్రజలు వాపోతున్నారు. సదరు అధికారులు స్పందించి శిథిలావస్థలో ఉన్న వంతెనకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

నిధులు మంజూరు కాలేదు

వంతెనను పరిశీలించాము. ఎస్టిమేషన్ వేసి పై అధికారులకు పంపించాం. నిధులు మంజూరు కాలేదు. నిధులు రాగానే వంతెనకు మరమ్మతులు చేపడతాం.

హరి, ఆర్అండ్‌బీ ఏఈ



గోతులతో నిండిన నెహరెల్లి ఛానల్ వంతెన



బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	135, 144, 155
చికెన్ విత్ స్కిన్	260
చికెన్ స్కిన్‌లెస్	270

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 430


మృతుడు సుంకర శివ

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

గూడూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : కోకనారాయణపాలెం వంతెన దగ్గర శనివారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తూ రామరాజుపాలెం కాల్వలో పడి సుంకర శివ (40) గల్లంతయ్యాడు. శివ మృతదేహాన్ని ఆదివారం అనంతాయిపేట వద్ద కాల్వలో గుర్తించారు. పోలీసులు శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం బందరు సర్వజన ఆసుపత్రికి తరలించినట్టు ఎస్సై కె.ఎన్.వి. సత్యనారాయణ తెలిపారు.


మచిలీపట్నం మానవత స్వచ్ఛంద సంస్థ చైర్మన్‌గా ఎన్నికైన మోటమర్రి బాబా ప్రసాద్‌ను సత్కరిస్తున్న డైరెక్టర్ పి.శ్రీరామ్

మానవత మచిలీపట్నం శాఖ చైర్మన్‌గా బాబాప్రసాద్

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మచిలీపట్నం శాఖ చైర్మన్‌గా మాజీ మునిసిపల్ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్టార్ స్కూలులో ఆదివారం జరిగిన ఎన్నికల్లో బాబా ప్రసాద్ చైర్మన్‌గా, ఉపాధ్యక్షుడిగా అయ్యప్పస్వామి, కార్యదర్శిగా హసీంబేగ్, గౌరవ డైరెక్టర్‌గా పి.శ్రీరామ్ ఎన్నికయ్యారు. అధ్యక్ష పదవికి ఎవరూ నామినేషన్ దాఖలు చేయనందున ఎన్నిక వాయిదా వేశారు. ఔట్‌గోయింగ్ ప్రెసిడెంట్ పి.శ్రీరామ్ మాట్లాడుతూ, బుడమేరు వరద బాధితులను ఆదుకునేందుకు నాలుగు రోజులు సేవ లందించామన్నారు. కృష్ణావిశ్వవిద్యాలయం, నియోజక వర్గంలో 25 పాఠశాలల్లో పదవ తరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన తరగతులు నిర్వహించామన్నారు. ఫ్రీజర్ బాక్సులు ఇస్తున్నామన్నారు. రక్తదాన కార్యక్రమాలు, ఉచిత వైద్య సేవలు, పేద విద్యార్థులకు ఫీజులు కట్టామన్నారు. సంస్థ కార్యవర్గ సభ్యులు ఉల్లి రంగారావు, సాయి కృష్ణప్రసాద్, కారుమూరి రాజేంద్ర ప్రసాద్, పి.వి.ఫణికుమార్, మద్దాల చింతయ్య, ఆదిత్య, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.


దేశవ్యాప్త సమ్మెకు సంఘీభావం తెలుపుతున్న సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు

కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలి

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : కార్మికులకు ఎనిమిది గంటల పని విధానాన్ని కొనసాగించాలని, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మాదాల వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. మే 20న దేశవ్యాప్తంగా జరిగే సమ్మెలో కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ నాయకుడు లింగం ఫిలిప్ మాట్లాడుతూ, అసంఘటిత కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు. సీఐటీయూ నాయకులు బి. సుబ్రహ్మణ్యం, టి. చంద్రపాల్, సిహెచ్. జయరావు, ఎండి అక్బర్, బి. ఝాన్సీలక్ష్మి, భాగ్యలక్ష్మి, ఏఐటీయూసీ నాయకుడు ఓ.ఎల్.రావు, వై. ఈశ్వరరావు పాల్గొన్నారు.


పుట్టగొడుగుల పెంపకంపై మహిళలకు శిక్షణ ఇస్తున్న వ్యవసాయ కళాశాల విద్యార్థులు

మహిళలు స్వయంకృషితో ఎదగాలి

మోపిదేవి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : మహిళలు స్వయంకృషితో ఆర్థిక స్వావలంబన సాధించేందుకు ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ సుధారాణి తెలిపారు. రావివారిపాలెంలో కృషి విజ్ఞన కేంద్రం, బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు సంయుక్తంగా పాల పుట్టగొడుగుల పెంపకంపై మహిళలకు అవగాహన కల్పించారు. మహిళలు స్వయం ప్రతిపత్తితో ఎదిగేందుకు కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇంటి వద్దనే ఉంటూ పుట్టగొడుగుల పెంపకం ద్వారా ఆర్థికంగా ఎదగవచ్చునని తెలిపారు. విద్యార్థులు, మహిళలు పాల్గొన్నారు.

తీర ప్రాంతాన్ని అతి వెనుకబడిన ప్రాంతంగా ప్రకటించాలి : లకనం

అవనిగడ్డ, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : తీర ప్రాంతాన్ని అతి వెనుకబడిన ప్రాంతంగా ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ సంప్రదాయ మత్స్యకారుల సేవా సమితి ప్రధాన కార్యదర్శి లకనం నాగాంజనేయులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. అవనిగడ్డలో ఆదివారం ఆయన మాట్లాడారు. తీర ప్రాంతంలోని 36 కిలోమీటర్ల పరిధిలో మత్స్యకారులు నివశించే గ్రామాలు ఉన్నాయన్నారు. నిత్యం సముద్రంలో చేపల వేటకు వెళ్లేనే మత్స్యకారులకు పూట గడుస్తుందన్నారు. మడ అడవుల నుంచి రహదారులు లేకపోవటం వల్ల పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మండలంలో ఈలచెట్లదిబ్బ, ఎదురుమొండి దీవుల గ్రామాలు కృష్ణానది మధ్య ఉన్నాయన్నారు ఈ దీవి గ్రామాల మధ్య మడ అడవి భూములు ఉండటంతో అంతర్గత రహదారులు, వంతెనల నిర్మాణానికి అటవీశాఖ అనుమతులు ఇవ్వడం లేదన్నారు. ప్రకృతి వైపరీత్యాలు, అత్యవసర పరిస్థితుల్లో వైద్యం కోసం మత్స్యకారులు మండల కేంద్రానికి వెళ్లే లోపు ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. తీర ప్రాంత, దీవుల గ్రామాలను అతి వెనుకబడిన ప్రాంతంగా ప్రకటించి, అభివృద్ధికి తక్షణం ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని ఆయన ప్రభుత్వాలను కోరారు.

మృతుడి కుటుంబానికి కొనకళ్ల, కనపర్తి పరామర్శ



నాగాయలంక, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : ఎదురుమొండిలో ప్రమాదవశాత్తు మృతి చెందిన టీడీపీ కార్యకర్త పెదసింగు దుర్గారావు చిత్రపటానికి టీడీపీ నేతలు ఆదివారం నివాళులర్పించారు. కుటుంబసభ్యుడు కృష్ణారావుని ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, నియోజకవర్గ పరిశీలకు కనపర్తి శ్రీనివాసరావు పరామర్శించారు. మండవ బాలవర్ధిరావు, మండల పార్టీ అధ్యక్షుడు మెండు లక్ష్మణరావు, కోడూరు మండల అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు, యాసం చిట్టిబాబు, దివి మార్కెట్ యార్డు చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, తెలుగు మహిళా జిల్లా అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత, విశ్వనాథపల్లి పాప, యార్లగడ్డ సీతారామయ్య, వేముల కృష్ణారావు, కర్రా సుధాకర్, కన్నా నాగరాజు, లుక్కా శ్రీను, గుడివాక శివరామ్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



క్యాన్సర్‌పై అవగాహన శిబిరంలో మాట్లాడుతున్న డాక్టర్ దినేష్‌రెడ్డి


అవనిగడ్డలో మాట్లాడుతున్న డాక్టర్ కుమార స్వామి

తొలిదశలో గుర్తిస్తే కేన్సర్ నియంత్రణ సాధ్యమే

● కేన్సర్ వైద్యనిపుణుడు డాక్టర్ దినేష్‌రెడ్డి

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : తొలిదశలో గుర్తిస్తే కేన్సర్‌ను నియంత్రించవచ్చని మణిపాల్ ఆసుపత్రి కేన్సర్ నిపుణుడు డాక్టర్ అర్జా దినేష్‌రెడ్డి అన్నారు. గాంధీనగర్ వాకర్స్ భవనంలో ఉదయపు నడక మిత్ర మండలి, మహిళా విభాగం ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన సమావేశంలో డాక్టర్ దినేష్‌రెడ్డి మాట్లాడారు. ఇంటిలో తయారు చేసిన ఆహార పదార్థాలు తినడం వల్ల కేన్సర్‌ను నియంత్రించవచ్చన్నారు. మహిళల్లో రొమ్ము, సర్వైకల్ కేన్సర్ ఎక్కువగా కనిపిస్తోందన్నారు. 40 ఏళ్లు నిండిన ప్రతి మహిళ ఏడాదికోసారి మెమోగ్రామ్ పరీక్ష చేయించుకోవాలన్నారు. 30 ఏళ్లు దాటిన మహిళలు పాప్‌సిమియర్ పరీక్ష చేయించుకోవాలన్నారు. మద్యపానం, ధూమపానం వల్ల పురుషుల ఊపిరితిత్తులు పాడై కేన్సర్ బారిన పడుతున్నారన్నారు. ప్రొస్టేట్ కేన్సర్‌ను ఎండోస్కోపి, ఐవోస్కోపి పరీక్షల ద్వారా గుర్తించవచ్చన్నారు. యోగా, వ్యాయామం వంటి అలవాట్లతో కేన్సర్ వ్యాధి దూరమవుతుందన్నారు. ఉదయపునడక మిత్ర మండలి అధ్యక్షుడు జల్లు మురళీనాథ్, కార్యదర్శి ఘంటసాల రాము, కారుమూరి రాజేంద్రప్రసాద్, వై. జగన్‌మోహనరావు, లంకిశెట్టి నీరజ, విన్నకోట సత్యవతి పాల్గొన్నారు.

ఆహార నియమాలతో సంపూర్ణ ఆరోగ్యం

అవనిగడ్డ : నియమబద్ధ ఆహార వినియోగంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని ఆరోగ్య భారతి క్షేత్ర సంయోజక్ డాక్టర్ కుమార స్వామి అన్నారు. అవనిగడ్డలో సంపూర్ణ ఆరోగ్యంపై శిక్షణ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. డాక్టర్ కుమారస్వామి మాట్లాడుతూ అనారోగ్యానికి ప్రధాన కారణం ప్రకృతిని విడచి కృత్రిమంగా తయారు చేసిన ఆహారం వినియోగించటమేనన్నారు. ఆరోగ్య భారతి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పి.ఎస్.రావు ప్రథమ చికిత్స కార్డియో అరెస్ట్, గుండెపోటు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని తెలియజేశారు. ప్రాంత సహకార్యదర్శి డాక్టర్ ఏ.వి.ఎల్.నారాయణ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవన విధానం, అందులో గృహిణి పాత్రపై అవగాహన కలిగించారు. జిల్లా కార్యదర్శి జల్లూరి రమాకుమారి, కార్యవర్గ సభ్యులు కామేశ్వరి, వంగర శేషగిరిరావు, గుడిసేవ విష్ణు ప్రసాద్, మునగాల ఉదయ్ కుమార్, తుంగల వెంకటగిరి, ఆరోగ్య భారతి కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉగ్రదాడిపై చల్లపల్లిలో నిరసన

● అఖిలపక్షం ఆధ్వర్యంలో ఉగ్రవాదం దిష్టిబొమ్మ దహనం


చల్లపల్లిలో ఉగ్రవాదం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న అఖిలపక్షం, ప్రజాసంఘాల నేతలు

చల్లపల్లి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : పెహల్గామ్ ఉగ్రదాడిని ఖండిస్తూ చల్లపల్లిలో అఖిలపక్షం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం వినూత్నరీతిలో నిరసన తెలిపారు.

మృతి చెందిన పర్యాటకుల మృతికి నివాళిగా ప్రధాన సెంటర్లో మౌనం పాటించారు. ఉగ్రవాదుల దాడిని ముక్తకంఠంతో ఖండించారు. ఉగ్రవాదం, మతోన్మాదం నశించాలి అంటూ నినాదాలు చేశారు. ఉగ్రవాదం దిష్టిబొమ్మను దహనం చేసి తమ నిరసన వ్యక్తం చేశారు.

టీడీపీ ప్రధాన కార్యదర్శి యార్లగడ్డ శ్రీనివాసరావు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్‌బాబు, ప్రజాసంఘాల నేత దాసి సీతారామరాజు పర్యవేక్షణలో జరిగిన నిరసనలో ఎంపీపీ కోట విజయరాధిక, వైస్ ఎంపీపీ పిట్టు వెంకటేశ్వరమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు పైడిపాముల స్వప్న, రైతుసంఘం రాష్ట్ర నేత హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ, నేతలు షేక్ నబీషోరి, మీర్ రిజ్వాన్, బోలెం నాగమణి, వాకా రామచంద్రరావు, షేక్ నసీంషోరి, వెనిగళ్ల వసంతరావు, నర్రా చిన్ని, బత్తుల ప్రసాద్, ఉప్పల సాంబశివరావు, బి.కనకదుర్గ, తుటారం ప్రసాద్, రావి రాజేశ్వరరావు, అట్లూరి వెంకటేశ్వరరావు, కొల్లూరి శ్రీధర్, సిద్ధాబత్తుల వాసు పాల్గొన్నారు.

పులిగడ్డ సర్పంచ్ విజయ్ కుమార్‌కు గౌరవ డాక్టరేట్



అవనిగడ్డ రూరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : పులిగడ్డ పంచాయతీ సర్పంచ్ దాసరి విజయ్ కుమార్‌కు గౌరవ డాక్టరేట్ లభించింది. తమిళనాడులోని హోసూరులో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ అకాడమి సర్పంచ్ విజయ్ కుమార్‌కు గౌరవ డాక్టరేట్ అందజేసింది. ఫిబ్రవరిలో హైదరాబాద్ సారస్వత పరిషత్, విశ్వ ఆర్ట్స్ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మక మదర్ థెరెసా విశిష్ట సేవా జాతీయ పురస్కారాన్ని సర్పంచ్ విజయకుమార్ అందుకున్న విషయం విదితమే. పలువురు ప్రముఖులు సర్పంచ్ విజయ్ కుమార్‌కు అభినందనలు తెలియజేశారు.



వైభవంగా దుర్గా గణపేశ్వరస్వామి కల్యాణం

నాగాయలంక, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : గణపేశ్వరంలో దుర్గా గణపేశ్వరస్వామి దివ్య కల్యాణ మహోత్సవాలు వైభంగా జరిగాయి. శనివారం రాత్రి స్వామి, అమ్మవారి కల్యాణం దుర్భా హరిబాబు బ్రహ్మత్వంలో నేత్రపర్వంగా జరిగింది. ఆదివారం రథోత్సవంతో ఉత్సవాలు ముగిశాయి. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త మండల శ్రీరామచంద్రమూర్తి, ఆలయ ఈవో సిహెచ్.సుధాకర్‌రావు, సిబ్బంది పర్యవేక్షించారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన



ఘంటసాల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : పర్ణశాల ప్రార్థనా మందిరం (ఘంటసాల) ఆధ్వర్యంలో ఘంటసాలపాలెంలో చిన దళితవాడలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మచిలీపట్నానికి చెందిన డాక్టర్ ప్రవళిక 103 మంది రోగులకు పరీక్షలు చేసి, రూ.22 వేల విలువైన మందులను ఉచితంగా అందజేశారు. పాస్టర్ పి.ఎస్.రాజు, కిరణ్, సుకన్య, వెంకటరత్నం, చంద్రశేఖర్, బిందు, కోటేశ్వరరావు, కోటయ్య స్వామి, గ్రామ పెద్దలు, విశ్వాసులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో దాడి



మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం పాత రైల్వేస్టేషన్ వద్ద మద్యం మత్తులో మందుబాబులు పరస్పరం దాడి చేసుకున్నారు. ఆ సమయంలో అటుగా వెళ్తున్న జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఉద్యోగి కిషన్‌సింగ్‌పై కూడా దాడి చేశారు. మచిలీపట్నం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సూర్యనారాయణస్వామి శాంతి కల్యాణం



అవనిగడ్డ రూరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : వేకనూరులో సూర్యనారాయణ స్వామి శాంతి కల్యాణం ఆదివారం వైభవంగా నిర్వహించారు. రామ్మోహనరావు, తుంగల లక్ష్మీరాఘవ, సాయికృష్ణ, అద్దేపల్లి లక్ష్మణ స్వామి దంపతులు పీటల మీద కూర్చుని కల్యాణం నిర్వహించారు. లక్ష్మీరాఘవ - ఝాన్సీ వాణి ఆర్థిక సాయంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అర్చకులు దీవి నరసింహమూర్తి స్వామివారికి విశేష అలంకరణ గావించారు. ఆలయ ధర్మకర్త తుంగల వీరవసంతరావు - ఇందిరా దంపతులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మస్తాన్‌రావుకు మండలి పరామర్శ

నాగాయలంక, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : నాగాయలంకలో ప్రముఖ టీడీపీ నాయకులు తిరుమలశెట్టి మస్తాన్‌రావును పలువురు పరామర్శించారు. కిడ్నీ సమస్యతో బాధపడుతున్న మస్తాన్‌రావును శనివారం రాత్రి ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, మండలి వెంకట్రామ్, టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు, పీసీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు పరామర్శించారు. ఆదివారం ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, కొల్లూరు వెంకటేశ్వరరావు, టీడీపీ నేతలు మెండు లక్ష్మణరావు, మండవ బాలవర్ధిరావు, తలశిల స్వర్ణలత, బండే శ్రీనివాసరావు పరామర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు.

గంగానమ్మ నెల సంబరం రేపు

కోడూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : కోడూరులో కొలువై ఉన్న గంగానమ్మ అమ్మవారి నెల జాతర మహోత్సవం మంగళవారం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త కోట యుగంధర్ రావు తెలిపారు. మంగళవారం ఉదయం గణపతి పూజ, మండపారాధన, అఖండ స్థాపన, కుంకుమ పూజ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం ఎనిమిది గంటలకు పోతురాజు సంబరం, మధ్యాహ్నం అమ్మవారికి చద్ది నైవేద్యాలు సమర్పించడం, రాత్రికి సంబరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

పాత ఉపకాలి, సంగమేశ్వరం గ్రామాలకు తాగునీరు సరఫరా

నాగాయలంక, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : వేసవి ఎండల తీవ్రత నేపథ్యంలో తీర గ్రామాల దాహార్తిని తీర్చేందుకు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఉచిత త్రాగునీరు సరఫరా చేశారు. మండలంలోని పాత ఉపకాలి, సంగమేశ్వరం గ్రామాల ప్రజలకు 20 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన తాగునీటిని వాటర్ ట్యాంకర్ ద్వారా సరఫరా చేశారు. మండలి ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన తాగునీటి సరఫరాను ఎమ్మెల్యే తనయుడు మండలి వెంకట్రామ్ పర్యవేక్షించారు.

వేసవిలో బాటసారుల దాహార్తి తీర్చాలి

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : బాటసారుల దాహార్తిని తీర్చేందుకు స్వచ్ఛంద సేవా సంస్థలు ముందుకు రావాలని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ పిలుపునిచ్చారు. గాంధీబొమ్మ సెంటర్‌లో డిస్ట్రిబ్యూటరీ కమిటీ వైస్ చైర్మన్ శాయన శివయ్య ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. తోట సునీత, శివ, వెంకన్నబాబు, గడ్డం రాజు, మహేష్, పినిశెట్టి వేణు, తోట రాజేష్, చలమలశెట్టి రమేష్, కొండా మేస్త్రి, పృథ్విగణేష్ పాల్గొన్నారు.

జిల్లాలోని 109 గ్రంథాలయాల్లో ఉచిత శిక్షణ శిబిరాలు నేటి నుంచి

● జిల్లా గ్రంథాలయ సంస్థ ఉపగ్రంథాలయాధికారి నగేష్

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని 109 గ్రంథాలయాల్లో సోమవారం నుంచి పఠనాశక్తిని పెంపొందించేందుకు వేసవి శిక్షణా శిబిరాలు నిర్వహిస్తున్నట్టు జిల్లా గ్రంథాలయ సంస్థ ఉపగ్రంథాలయాధికారి నగేష్ తెలిపారు.

సోమవారం నుంచి జూన్ 6వ తేదీ వరకు ఉదయం 8 నుంచి 12 గంటల వరకు ఈ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ శిక్షణలో విద్యార్థులతో కథలు చెప్పించడం, జనరల్ నాలెడ్జ్ వంటి అంశాలపై శిక్షణ ఇవ్వడం, విద్యార్థులను ఆసక్తి కలిగించే విధంగా పాటలు పాడించడం, స్పోకెన్ ఇంగ్లీషు, డ్రాయింగ్, పెయింటింగ్, పేపర్ క్రాఫ్ట్, డ్యాన్స్, పప్పెట్ మేకింగ్, చదరంగం, క్యారమ్స్, క్విజ్ వంటి కార్యక్రమాలు చేపట్టనున్నట్టు నగేష్ తెలిపారు. మచిలీపట్నం జిల్లా కేంద్ర గ్రంథాలయంతో పాటు ఈడేపల్లి, చిలకలపూడి, పెడన, గూడూరు తదితర ప్రాంతాల్లోని గ్రంథాలయాల్లో జరిగే కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అవనిగడ్డ ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో..

అవనిగడ్డ, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : అవనిగడ్డలోని ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో ఈనెల 28 నుంచి జూన్ 6వ తేదీ వరకు వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారి జె.ప్రభుదాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు పాల్గొనవచ్చునని, ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శిబిరం జరుగుతుందన్నారు. విద్యార్థులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కోడూరు గ్రంథాలయంలో..

కోడూరు : కోడూరు గ్రంథాలయంలో సోమవారం నుంచి విద్యార్థులకు వేసవి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారిణి వై.పుష్పలత తెలిపారు.

జూన్ 6వ తేదీ వరకు వేసవి శిక్షణ శిబిరం జరుగుతుందని, విద్యార్థులు పాల్గొనాలని ఆమె కోరారు.

జనరల్ నాలెడ్జ్ స్పోకెన్ ఇంగ్లీషు, డ్రాయింగ్, పెయింటింగ్, పేపర్ క్రాఫ్ట్, డ్యాన్స్ చదరంగం, క్యారమ్స్ తదితర అంశాలలో శిక్షణ ఇస్తామన్నారు.